# ఆపరేషన్ ఫాల్కన్

**తూ**ర్పు కనుమల్లో నుంచి వంపులు తిరిగి సుదీర్ఘంగా కనుచూపు మేర సముద్రం మొగ వరకు విస్తరించుకొన్న విశాలమైన సరస్సు. సరస్సు కుడి ఆవలివైపున ఎత్తుగా పెరిగిన సరుగుడు తోటలు నిర్జన సైకతాల్లో సముద్రతీరం వరకు వ్యాపించి వున్నాయి.

సరస్సులో దట్టంగా పెరిగి పెనవేసుకున్న జమ్మిగడ్డి పొదలు. ఎత్తుగా ఏపుగా లేచిన తుంగ గుబుర్లు. వాటి మధ్య తలలూపుతున్న తెల్లటి రెల్లుగడ్డి పూల కంకెలు. చిక్కగా అల్లుకుని నీటిమీద తేలుతున్న ఆకుపచ్చని బూజు వంటి నాచు. వాటి మధ్య నీటిలో తూడులు దిగిన తామరాకులు. నీటిలో అడుగున బురదలో నుంచి గజిబిజిగా పెరిగి పెనవేసుకున్న జీమూతాల్లాంటి నాచు తీగలు. ప్రకృతి రమణీయంగా వుంది. పచ్చదనం మైళ్ళ కొద్దీ పరచుకుని వుంది.

ఆకాశపు వెలుగు నీడలలో ఎటు చూసినా చిక్కటి పచ్చదనం. నీలి రంగు చిమ్ముతున్న తేట నీటిలో నీటి మొక్కలు. ఒడ్డున ఎండీ ఎండని బురదనీటి జాడలు కనులకు ఇంపుగా కనిపిస్తున్నాయి. సరస్సుకి ఇవతలి వయిపుకి అస్తవ్యస్తంగా పెరిగిన మొగలి పెండెలు. దూరంగా బెస్తపల్లె.

అర్ధరాత్రి దాటింది. బెస్తపల్లెలో సద్దుమణిగింది. పగలంతా చేపల వేటలో కష్టపడ్డ పల్లె జనం ఆదమరచి నిద్రబోతున్నారు. గుడిసెల్లో మిణుకు మిణుకు మంటున్న దీపాలు చీకట్లో సరస్సు దగ్గర నుంచి స్పష్టాస్పష్టంగా కనిపిస్తున్నాయి. చుక్కలు పరుచుకొన్న ఆకాశం క్రింద సరస్సు నిర్జనంగా నిశ్శబ్దంతో నిండి వుంధి.

ఆ అర్ధరాత్రి నావమీద తిరుగుతూ సరస్సు మీద కావలి కాస్తున్నాడు కొండడు. ఎక్కడో అలికిడి ''ఓహెయ్.. హేయ్'' అని హెచ్చరిస్తూ కేక పెట్టాడు. చీకట్లో ఆ కేక సరస్సు మీద గాలిలో తేలుకుంటూ ఆ నిశ్శబ్ద వాతావరణంలో సుదూరంగా వినిపిస్తోంది. బెస్తపల్లెలో మగత నిద్రలో వున్న చిలక చెవికి ఆ కేకలు సోకాయి. ''కొండడి కేకలు' అని నిద్రలో ఒళ్ళంతా గగుర్పొడిచినట్లయి కిలకిలా నవ్వుతూ, కలవరిస్తూ, క్రమంగా నిద్రమైకంలో జారుకుంది.

## 2

ఆ నిర్జన ప్రదేశంలో సరస్సు ఒడ్డున చిన్న గుడిశ. అందులో ఒంటరిగా ఉంటున్నాడు కొండడు. కొన్ని నెలల క్రితమే తనని పెంచి పెద్ద చేసిన ముసిల్ది చచ్చి పోయింది. ఆ సరస్సుకి కాపలాదారు కొండడు. దొంగతనంగా సరస్సులో చేపలు పట్టకుండాను, సరుగుడు తోటల్లో రాత్రిళ్ళు కర్రలు నరుక్కు పోకుండాను కొండడిని కాపలా పెట్టాడు ఆ ఊరు పెద్ద కాపు.

కొండడు పెద్దకాపు ఇచ్చిన పడవ మీద సరస్సుపై గస్తీ తిరుగుతుంటాడు. చేపలు పట్టే వాళ్ళ దగ్గర నావకి వారానికి సుంకం. చేపలు పట్టడానికి ప్రతీరోజూ ఆసీలు, కర్రలు కొట్టే కూలీల దగ్గర రోజు వారీ మామూళ్ళు వసూలు చేసి పెద్దకాపుకి జమకడుతుంటాడు.

కొండడికి పేరు ఉందో లేదో ఎవరికీ తెలీదు. చంటిపిల్లాడిగా ఉన్నప్పుడే కొండల్లో ఉండే తన అమ్మమ్మ ముసిలి దానితోపాటు పెదకాపు వాణ్ణి తీసుకువచ్చేడు. చిన్న గుడిసె కట్టించి సరస్సుకి, సరుగుడు తోటలకి, జీడి తోటలకి కాపలా ముసల్దాన్ని పెట్టాడు. కొండల్లోంచి వచ్చాడు కాబట్టి

అందరూ కొండడు అనిపిలిచే వాళ్ళు. కొండల్లో పెరిగిన ముసిల్ది గెద్ద కళ్ళతో పెదకాపు ఆస్తిని కాపలా కాస్తూ మనుమడ్ని కళ్ళల్లో ఒత్తులు పెట్టుకొని కాపాడుకొంటూ పెంచి పెద్ద చేసింది.

కొండడికి చిన్నప్పుడు జుత్తు కొర్రుల్లాగ, తల ఉడతలు పీకిన తాటి టెంకలాగ ఉండేవి. చిన్ని నుదురు. దుబ్బుల్లాంటి చొచ్చుకొచ్చిన బుడ్డ పెదాలతోపాటు అందమైన కోటేరు లాంటి ముక్కు, పచ్చటి శరీరం. తోటలో పెరిగిన కొమ్మతో అంటుగట్టిన అడవి చెట్టు పూచిన పువ్వులా ఉండే వాడు.

కొండడు చిన్న తనంలోనే పడవలో ముసిల్దానితో తిరిగేవాడు. నీలాకాశం మీద ఎగిరే కొంగల్ని పిలిచేవాడు. మేఘం ఉరిమితే ఉలిక్కి పడేవాడు. ఆకాశం మెరిస్తే లేడి పిల్లలా పిరికి చూపులు చూసేవాడు. రాను రాను వయస్సుతో ఎదుగుతూ దిట్టబడ్డాడు. చిన్నప్పటి కళ్ళలో అమాయకత్వం అడవి పిల్లి కళ్ళలోని తీక్షణతకి మారిపోయింది. చేపల వేటలో ఆ మొత్తం పల్లెలో ఎవ్వరూ కొండడితో పోటీ పడలేక పోయారు. ఈటెతో (చేపల్ని) పొడిచి వేటాడ్డంలోని వాడి మెళకువ చూసి వంశపారంపర్యంగా చేపల్ని పట్టే (వంశవృత్తి గల) బెస్తలు కూడా ఆశ్చర్య పోయేవారు. పడవ మీద నిల్చొని గెడేస్తే నాచుని కోసుకుంటూ బాణంలా పరుగెత్తేది పడవ. అంత వేగంలోనూ గెడను మారుస్తూ నాచు గడ్డి గుబుర్లలో నుంచి పొదల్లో నుంచి పాములా మెలికలు తిప్పుతూ పడవని పరుగెత్తించేవాడు. తనని పెంచి పెద్ద చేసిన ముసల్ది చనిపోవడంతో కొండడు ఏకాకి అయిపోయాడు. పుట్టగానే తల్లిని పోగొట్టుకున్న కొండడు ముసలిదాని చావుతో ప్రేమకి, అప్యాయతకీ, ఆదరణకీ దూరమైపోయాడు. అంతా శూన్యంగా తోచేది. అంతటి దుర్భరమైన ఒంటరి జీవితంలోనూ తనకు ఊరట కల్గిస్తున్నది ఒక్కటే ఒక్క ప్రాణి పెంపుడు డేగ. అడవి పిట్ట. దాన్ని పట్టి, పెంచి మచ్చిక చేసుకున్నాడు. అది కొండడి చేతి మీదో, భుజం మీదో పడవలోనో; అతని కూడా తిరుగుతుండేది.

## 3

పెద్దకాపు మంచి వయస్సులో వున్న రోజుల్లో, కొండల్లో అడివి కాంట్రాక్టు చేసి చాలా డబ్బు సంపాదించాడు. తరువాత అక్కడ ఏవో తగువుల మూలాన్న మరి పని సాగించలేక కాంట్రాక్టు విడిచి పెట్టి ఆ డబ్బుతో ఇక్కడ సరస్సు మీద చేపల కాంట్రాక్టు పాడాడు. చేపల పల్లెలో డాబా ఇల్లు కట్టించాడు. సంవత్సరాలు దొర్లిన కొద్దీ సరస్సును ఆనుకునున్న సరుగుడు తోటల్నీ, పంట భూముల్నీ కొన్నాడు. ఆ పల్లెలో పెదకాపు మాటకి తిరుగు లేదు. ఎదురుతిరిగిన వాడికి ఆ చుట్టుపక్కల నిలువ నీడ లేకుండా చెయ్యగల స్తోమత సంపాదించాడు. కొండల్లో అనుభవం బట్టి దండోపాయం ఒక్కటే మనుషుల్ని మచ్చిక చేసుకొనే విధానం అని గట్టిగా నమ్మే వ్యక్తి. ఆసీళ్ళు ఎగగొట్టినా, దొంగతనంగా చేపలు పట్టినా వాడ్ని పట్టుకొని చెట్టుకు కట్టి, కొరడాతో గొడ్డును బాదినట్లు బాదేవాడు.

పెద్దకాపుకు పిల్లలు లేరు. అతని పెళ్ళాం, పెంచుకున్న కొడుకును పట్నంలో ఉండి చదివించు కొంటోంది. అడవుల్లో వున్నప్పుడు తన ఇంట్లో వెట్టిచాకిరి చేసిన ముసిలిదానిని, దాని మనువడిని తనతో కూడా తీసుకువచ్చి ఇక్కడ సరస్సు మీద కాపలాకి కాపరం పెట్టించేడు. ''నా దగ్గర పనిచేసే వాళ్ళని ఎప్పుడూ అనాథల్ని చెయ్యను'' అని నిదర్శనంగా వాళ్ళని చూపుతూ మిగతావాళ్ళ స్వామి

# 4

పెంపుడు డేగతో కాలం వెళ్ళబుచ్చుతున్న కొండడి ఏకాంత జీవితంలోకి కాల కెరటం మీదఓ వెండి మబ్బు దరిసింది. చిలక, చేపలపిల్ల.

చేపల పిల్ల చిలక నల్లగా ఉన్నా వంపులు తేరిన శరీరంలో, పొందికైన అవయవాలతో బింకంగా నల్ల ముత్యంలా వుంటుంది. ఎప్పుడూ చిన్న పరుగే. ప్రతీ చిన్న విషయానికి విరగబడి నవ్వేది. పగలల్లా పుల్లలు ఏరటం, సాయంకాలం పొయ్యి రాజేసి మారటి తల్లికి వండిపెట్టడం చిలక దిన చర్యలు. ఉన్న దొక్కర్తి. తండ్రి పోయాడు. మారటి తల్లికి పిల్లలు లేరు. చిలకని స్వంత కూతురిలా పెంచింది. కూతురు ఎక్కడికి వెళ్ళినా ఎప్పుడు వచ్చినా ఆమె మీద ఆంక్షలు వుంచేది కాదు. ''ఆడ పిల్లని అలా ఒంటరిగా ఒగ్గేస్తున్నావ్. జాగర్తోలమ్మ'' అంటే ''ఆదిసిలకే. సిలకైనా ముద్దెట్టుకో బోతే ముక్కు కొరికిపారేస్తాది'' అనేది. చిలక అప్పుడప్పుడు చీకటి పడ్డాక తెల్లవారుజామున సరస్సులో చిన్న చిన్న దొంగతనాలు చేసేది. నీటిలో నక్కుకుంటూ పోయి మావుల బుట్టల్లో పడిన వాలుగల్ని, ఇసుక దొంతుల్ని దొంగలా ఇంటికి చేరేసేది. పగలు మగరాయుడులా తిరుగుతూ వీలు చిక్కినప్పు డల్లా జీడిపిక్కల్ని, మెట్టల్లో పండే పుచ్చకాయల్ని వాటంగా కాజేసేది. స్వభావమైన నేరస్థ జాబితాకు చెందింది కాదు. చిలక్కి దొంగతనం అవసరం కాదు. అలా చిన్న చిన్న దొంగ తనాలు చేసి పట్టుబడ కుండా తిరగటంలో ఒక ఆనందముండేది. ఆ ఆనందంకోసం ఆమె అప్పుడప్పుడు అలా సాహసాలు చేసేది.

కొండడు ఒంటరిగా కనిపిస్తే ఏడిపించాలని బుద్ధి పుట్టేది. ఒక్కొక్కసారి వాడి ఒంటరి జీవి తానికి జాలివేసేది. గుంపులో నుంచి విడిపోయి ఒంటరిగాతిరుగుతున్న పిట్టని పట్టుకుని మచ్చిక చేసి ముచ్చట తీర్చుకోవాలనే సరదా లాంటిది కలిగేది, కొండడ్ని చూస్తుంటే. కొండల్లోని పిట్ట, రెక్కల్తో కొట్టి గోళ్ళతో గీకుతుందనే చిన్న భయం కూడా వుండేది. కొండడి కనుముక్కు తీరులో, కండలు తిరిగిన శరీరంలో, అనాగరిక శిల్పాలలో కనిపించే ఒక మోటు అందాన్ని చూసేది. డేగతో గుడిసెలోనుంచి బయటకి వచ్చి నావని తోసుకుంటూ కొంతదూరం పోయి, ఎగిరి లోనికి దూకి, జోరుగా పడవను నడుపుతూ పోయే కొండణ్ణి చూస్తుంటే; చిలక్కి, కథల్లో రాజకుమారులు జ్ఞాప కానికొచ్చేవారు.

గులకరాయి గుమ్మంలో నుంచి గుడిసెలో కుండల మీద పడింది.

కొండడు బయటకు వచ్చాడు. ఎదురుగా చిలక కిల కిల నవ్వుతోంది.

''రాయి.... రాయి. నువ్వు?''

నల్ల ముత్యం తన ముసి ముసి నవ్వుల్ని పైట చెంగులోకి నొక్కుకుంటూ నవ్వింది.

''ఏటా నవ్వు? రాయెందుకేసావ్?''

''ఏమో!'' వయ్యారంగా అమాయకంగా చూస్తూ ఆశ్చర్యపోయింది. సమాధానం అర్థం కాక అయోమయంగా ముఖం పెట్టి చిలక కళ్ళల్లోకి చూశాడు.

అణుచుకున్న నవ్వు కట్టలు తెంచుకుంటున్నట్లు వికా వికలుగా విరగబడి నవ్వుతూ గట్టు వెంబడి పరుగెత్తిపోయింది. నవ్వుల్లో పుచ్చ పువ్వుల్లాంటి మెత్తదనం, పరుగుల్లోని వయస్సు పులకింతలతో

భక్తిని చూరగొనడానికి ప్రయత్నిస్తుండేవాడు.
కొండడి మనస్సు విచిత్రానుభూతితో తేలిపోయింది.

ఆరోజు నుంచి చిలకని చూద్దామని కొండడు తహతహ లాడేవాడు. ఎడారిలో తిరిగేవాడు. నీటి మాటుల కోసం తపించినట్టు చిలక కోసం వెతికేవాడు. దూరంగా కనిపించేది. ''హేయ్'' అని కేకవేసేది. వెక్కిరించేది. విరగబడి నవ్వేది. పారిపోయేది. హఠాత్తుగా దగ్గరపడితే ''ఎందుకూ అలా సూస్తావ్?'' అని క్షణం సేపు కళ్ళెర్ర జేసేది. మరుక్షణంలో నవ్వు. చూస్తుండగా మొగలి పెండెల్లో దూరమయ్యేది.

## 5

చంద్రుడు లేని ఆకాశం మీద వేగుచుక్క పొడిచింది. దూరంగా సరస్సుకి అవతల కొండల మీద తూర్పుదిక్కున మిణుకు మిణుకు మంటూ ప్రకాశిస్తోంది. వేగుచుక్కలోని ఎర్రజీర ఉండుండి తళుక్కు తళుక్కుమని మెరుస్తోంది. దాని కాంతిలో మిగతా చుక్కలు వెల వెల బోతున్నాయి. చుక్కల కాంతిలో విశాలంగా పరుచుకున్న సరస్సు మసగ మసగ్గా కనుచూపు మేర ఇరువైపులా కనిపిస్తోంది. చుక్క వెలుగులో తుంగగుబుర్లు చీకటి నీడలలో దోబూచు లాడుతున్నాయి. ఆ నిశ్శబ్ద వాతావరణం ఎక్కడో అరిచే నీటి పిట్ట అరుపుతోనూ, నీటిలో తుళ్ళిపడిన గండు చేప కెలికింపుతోనూ ఒక రకం జలదరింపు కలుగజేస్తోంది. సరుగుడు చెట్ల సందుల్లోనుంచి, సరస్సు వంపులు తిరిగిన కొండల వెనుక; ఆకాశం మీద లేత వెలుగు పొడకడ్తోంది. చీకట్లోకి మెల్లగా పరుచుకుంటున్నాయి తొలి సంధ్య వెలుగులు. ఆ వెలుగును చూసిన కొంగలు చెట్లమీది నుంచి గుంపులు గుంపులుగా లేస్తూ చీకట్లో అరుచుకుంటూ నీటిమీద ఎగురుతూ మంచు ముద్దల్లా సరస్సు మీదికి దిగుతున్నాయి. చల్లగాలులు తెరలు తెరలుగా వీస్తూ నాచుతోనూ, గడ్డితోనూ గుసగుసలాడుతూ మేలుకొంటున్న తామరలకు పులకరింతలు పెడ్తూ లేస్తున్నాయి.

సరస్సు మీద ఏదో అలికిడి, మగత నిద్రలో ఉన్న కొండడి చెవిని పడింది. కొండడు ఆవలించు కుంటూ లేచి గుడిసెలోనుంచి బయటకు వచ్చాడు. సరస్సు మీదపొగమంచు విస్తరించు కొంటోంది. దూరాన అక్కడక్కడ చేపల వేటకి బయలుదేరిన నావల మీద లాంతర్లు, మంచు కమ్మిన చీకట్లో సరస్సు మీద మిణుకు మిణుకుమని కనిపిస్తున్నాయి.

నీటిలో ఏదో కదులుతున్న చప్పుడు స్పష్టంగా వినిపిస్తోంది.

తిరిగి నిశ్శబ్దం... మళ్ళీ నీటిలో సడి.

నడుం బిగించి తన పడవ కోసం ఒడ్డుకు పరిగెత్తాడు. పడవ లేదు. క్షణం సేపు నిశ్చేష్టుడయ్యాడు. పడవని ఎవరో విప్పేశారు. నీటి వాటానికి తేలుకుంటూ ఎక్కడికో పోయింది. పడవ కోసం నీటిమీద కలయ చూస్తున్నాడు.

ఒడ్డున పరుగెత్తుతున్న పాదాల సడి.

కొండడు వెంబడించాడు

పొగమంచు

కిలకిల నవ్వులు– పరుగులు– విరగబడి నవ్వులు, నీటి మీద తేలుతూ మంచులో కలిసి మీద

పోయాయి.

కొండడు కూడా నవ్వుకున్నాడు.

## 6

ఒకరోజు మధ్యాహ్నం కొండడు దారపు ఉండల్ని, కొయ్య మేకుల్ని, వెదురు పుల్లలని ముందు పరుచుకుని పిట్టల వల అల్లుతున్నాడు. దారానికి పురివేసి అంబలి కలిపిన తుమ్మ జిగురుతో వాటిని గట్టిగా పేనుతూ సన్నటి పుల్లల్లా తయారుచేస్తున్నాడు. కొనలకు ఉరుల్లా జారుముడులు వేసి గుమ్మంలో నుంచి పడుతున్న ఎండలో ఆరబెడుతున్నాడు. రాత్రి మాగన్ను పడుతున్నప్పుడు నీటి బాతుల మందలు జుంయ్ జుంయ్ మని గాలి తెరల్లా ఆకాశం మీద ఎగురుతూ పోతున్న చప్పుడు విన్నాడు. ''శీతగాలి తిరిగింది, వలస పిట్టలు దిగుతున్నాయి''; అనుకున్నాడు. వాటిని పట్టుకోడానికి వల సిద్ధం చేస్తున్నాడు.

ఎదురుగా ఉయ్యాలలా వేలాడదీసిన వెదురు బద్ద మీద డేగ, కప్ప పిల్లని పొడుచుకు తింటోంది. గోళ్ళ మధ్యన అదిమి పట్టి చీల్చుతోంది. రెక్కలు కొట్టుకుంటూ వెదురు బద్ద మీద నుంచి జారిపడి పోకుండా కాసుకుంటూ తమాయించు కుంటోంది. వలని అల్లుతూ మధ్యలో కొండడు నాలికతో లొట్టలు వేస్తూ, ఆ లొట్టలకి అది సమాధానంగా కీచ్ కీచ్ మని సకిలిస్తున్నట్లు అరుస్తూంటే ముచ్చట పడిపోతున్నాడు.

''కుసు... కుసు'' అని ఎడమ చేతిని చాచాడు. కప్ప పిల్లని ఆరగించడం పూర్తి చేసిన డేగ తృప్తిగా ఎగిరి గంతేసినట్లు చేతి మణికట్టు మీద వాలింది. కుడిచేత్తో దాని ఒళ్ళంతా నిమిరాడు. అంబలి కలిపిన జిగురు వాసనకి కొండడి చేతి మీద పరిశీలనగా ముక్కుతో గీరుతోంది. మళ్ళీ సౌంజ్ఞ చేశాడు. చేతి మీద నుంచి భుజం మీదికి ఎక్కి కూచుంది. మెడని అటు ఇటు తిప్పుతూ గుండ్రని కళ్ళతో గుడిసంతా కలయచూస్తోంది. మచ్చిక చేస్తున్నప్పుడు డేగ రెక్కలతోనూ ముక్కుతోనూ పొడిచిన గాట్లతో కొండడి చేతి మణికట్టు, భుజం కదుములు గట్టి మాంసం ముద్దలు ముద్దలుగా పేరుకుని గట్టి పడిపోయివున్నాయి. అలా గట్టిపడిపోడానికి ముసల్ది అడవి ఆకుల పసర్లని రుద్దేది.

పిట్టల్ని పట్టడానికి వలలు అల్లటం, డేగల్ని మచ్చిక చేసి వేటాడించడం కొండడు ముసల్దానిదగ్గర నేర్చుకున్నాడు. ముసిలిదాని మొగుడు మొత్తం కొండ గూడేలకి డేగల పెంపకంలో ఉద్దండుడట. వాడు బ్రతికున్న రోజుల్లో నవాబులకీ, దొరలకి డేగల్ని అమ్మేవాడని మనుమడికి చెబుతుండేది. డేగ జాతిని పోల్చటం, దాన్ని పట్టడం, మచ్చిక చేసి వేట నేర్పటం ఆ తతంగం అంతా మొగుడు దగ్గర చూసిన ముసల్ది మనుమడికి నేర్పింది.

అలా వలని అల్లుకుంటూ డేగతో ఆడుకుంటున్న కొండడికి గుడిసెఅవతల నుంచి ''ఒరే కొండిగా? కొండలమ్ డీకే!'' అనే కేక వినిపించింది. బైట పెద్దకాపు, ఇంకాఅయిదారుగురు ఉన్నారు. పెద్దకాపు చేతిలో ఇనప తీగలాంటి టేకి తోక కొరడా వుంది. కొండడు డేగని కట్టేసి గుడిసెలో నుంచి బయటకు వచ్చాడు.

బెదురుగా అందరినీ చూస్తూ దండం పెట్టాడు.

''ఇలా దగ్గరకు రారా.'' గద్దించాడు పెదకాపు .

కలయజూస్తూ దగ్గరలో కనిపిస్తున్న నాచు గుబుర్లవైపు కొరడా పట్టిన చెయ్యి సూటిగా చూపిస్తూ అర్ధంకాక ముందుకు నడిచాడు కొండడు.

కొండడిని నఖశిఖ పర్యంతం పరీక్షగా చూశాడు పెదకాపు. తరువాత దృష్టి మళ్ళించి సరస్సుమీద కలయజూస్తూ దగ్గరలో కనిపిస్తున్న నాచు గుబుర్లవైపు కొరడా పట్టిన చెయ్యి సూటిగా చూపిస్తూ ''నా మావులు పెట్టే ఎక్కడ?'' అని నీటిమీద చూస్తూనే కొండడిని ప్రశ్నించాడు.

''అక్కడ నేదా?...ఉండాలే...మరి''

''గెద్ద తన్నుకు పోయిందిరా దొంగలంజకొడకా! నీ అమ్మ మొగుడు దొబ్బుకుపోయాడా?''

చివరితిట్టుకి కొండడి చీపికళ్ళు చింతనిప్పుల్లా మెరిసాయి. బుడ్డ పెదాలుఒణికాయి. తమాయించు కున్నాడు.

''మాట్లాడవేంరా? డబ్బిచ్చి దూలకి నిన్ను కాపలా పెట్టాన్రా? నిజం చెప్పు. ఆ మావులోని చేపల్ని ఎవడికిచ్చావు? ఎంత బేరం కుదిరింది'' ?

''నాకు తెల్దు''

''తెలీదూ.... గంగా ఆ బుట్ట ఇలాతే,'' గంగడు చేపలు ఉంచే దోసకాయ బుట్ట తెచ్చాడు.

''మొగిలి పెండిలో దొరికింది. అక్కడ నువ్వు దాయలేదురా నా కొడకా!?'' అని ఆ బుట్టని కాలితో ఒక తన్ను తన్నాడు. బుట్టలోనుంచి పెద్ద బొమ్మిడం విలవిల తన్నుకొంటూ బయటపడింది. క్షణంసేపు కొండడు ఆశ్చర్యపోయాడు. ''సత్తె ప్రమాణంగా నేను దొంగతనం చేయలేదు'' అని అవమానంతో రుద్ధమౌతున్న కంఠంతో అన్నాడు. అటువంటి నేరం తన మీద మోపొద్దని పెదకాపు కాళ్ళు పట్టుకోబోయాడు.

కొరడా జిగ్‌మని కొండడి వీపు మీద పేలింది. చర్మం పేలిక ఒలిచేసినట్లు ఊడింది. ''అమ్మా!'' అని గొడ్డు అరిచినట్లు మూల్గాడు. టేకి తోక కమ్చీ ఛెళ్ళు ఛెళ్ళున కొండడి శరీరాన్ని చీరేస్తోంది. గావుకేక పెట్టి పడిపోయి సొమ్మసిల్లి పోయాడు. ఆ కేకకి మర్రిచెట్టు మీద కాకుల గుంపు ఒక్కసారి అరుచుకుంటూ లేచి గోలచేస్తోంది.

గుడిసెలో గొలుసు కట్టిన డేగ బాధగా, కసితో క్రీచ్ క్రీచ్ మని పీండించుకుంటూ అరిచింది. అదే సమయానికి ఎక్కడ నుంచో వచ్చిన చిలక ఆదృశ్యాన్ని చూసి శివమెత్తిన దానిలా ''ఎందుకలా కొట్టి సంపేస్తారూ?'' అని చిందులేస్తూ చేతులు ఎగదోస్తూ అరిచింది.

''చంపడం కాదే. ముక్క ముక్కలకింద నరికేస్తాను.''

''నరికేస్తే అందరూ చూస్తూ వల్లకుంటారా?''

''ఊరుకోక! ఊరుకోక ఉరెట్టుకుంటారేటి? అసలు నువెవ్వవర్తివే అడిగేందుకూ? ఆడేటి నువ్వు కట్టుకున్న మొగుడేటే అలా గింజుకు పోతన్నావూ? అడునీ మొగుడేంటీ అంతగా ఎంటేసు కొస్తున్నావ్?''

మాట ముగియకముందే కోపంగా అరిచింది చిలక.

''మాట లొగ్గకు బాబూ మంచి దాన్ని కాదు!''

''నోర్ముయ్...మళ్ళీ మాట్లాడావంటే నీ ఒంటిమీద బట్టలు ఒలిచేసి ఊర్లో తిప్పించేగలను... పెద్దకాపు నజరు పడకపోవాలి, పడిందా అంతు చూస్తాడు. ఏటనుకున్నావో! జాగ్రత్త'' అని

ఒంటిమీద చిట్లిన చర్మంలోంచి నెత్తురు చారలు గడ్డకడుతున్నాయి. ఈగలు వాలకుండా చిలక విసురు తోంది. పొద్దు తిరిగిన తరువాత కొండడు కసింత మెదిలాడు. చిలక పరుగెత్తుకి వెళ్ళి సరస్సు లోంచి తామరాకులో నీళ్ళు తెచ్చింది. కొండడి ముఖం మీద చల్లింది. నీటితో ముఖం కడిగింది. కొండడు కళ్ళు మెల్లగా తెరిచాడు. మండుటెండ కళ్ళల్లోకి సూదుల్లా పొడుస్తూంది. తల తిరుగు తోంది. లేచి కూర్చోబోయి చతికిల బడిపోయాడు. దాహంతో అర్చుకుపోతున్న పెదాల్ని నాలికతో తడుపుకుంటూ ఒగరుస్తున్నాడు. చిలక మళ్ళీ తామరాకులో నీళ్ళు తెచ్చి ''ఊ! చెయ్యిపట్టు. తాగు'' అంది. ఒణికిపోతున్న దోసిట్లో నీళ్ళు మృగంలా కతుకుతూ తాగాడు. తలెత్తి చూచాడు. శాంతంగా రొప్పుతున్నాడు.

''ఎలాగుంది?'' చిలక అడిగింది.

చిలకని గుర్తుపట్టగలిగాడు. అతని కళ్ళల్లోని వ్యథ చిలక గుండెల్లో గాయాన్ని మరోసారి కెలికింది. ''గుడిసెలోకి పద'' అని నిల్చొని లేవనెత్తబోయింది. కొండడికి ఒళ్ళంతా చలిజ్వరంతో ఒణికినట్లు ఒణికింది. గుండెల్లోనుంచి దుఃఖంకెరటంలా తన్నుకొచ్చింది. చిలకకాళ్ళని అమాంతంగా కౌగలించుకుని ఒళ్ళో తలదాచుకుంటూ కుమిలి కుమిలి ఏడ్చాడు. ఆ ఏడుపు ఆ నిర్జన ప్రదేశంలో మరింత హృదయ విదారకంగా ఉంది.

''నాకు తెలీదు, నేను దొంగలాడలేదు'' అని మాటిమాటికి అంటున్నాడు.

''అవును ఆ దొంగతనం సేసింది నేనే. మావుల్లో బొమ్మిడిని తీసి దాసేసాను.''

కొండడు తలెత్తి చూశాడు.

చిలక కన్నుల నుంచి జలజలా రాలిన కన్నీరు కొండడి చెంపలమీదుగా జారుతోంది. ''నువ్వా చేశావ్! ఎందుకు చేశావ్?'' అంటున్నాయ్ చూపులు

''ముందు గుడిసెలోకి పద'' అని సమాధానం ఇవ్వకుండా కొండడ్ని లేవనెత్తి నడ్డిమీద చేతితో ఊత పట్టుకుంటూ తూలుతున్న కొండడ్ని గుడిసెలోకి తీసుకువెళ్ళింది.

కొండడ్ని చూసి డేగ సన్నగా సకిలించింది. అంత బాధలోనూ కొండడు వెళ్ళి మనసారా నిమురుతూ రెక్కల్ని ముద్దాడాడు. గొలుసు కట్టువిప్పి గుండెలకు హత్తుకున్నాడు.

చిలక నీళ్ళు మరగబెట్టి కొండడికి కాపటం పెట్టడానికి పొయ్యి దగ్గరకు వెళ్ళింది.

కొత్త ముఖం కంటబడగానే డేగ తీక్షణంగా చూసింది. క్రిందికీ మీదకు తల ఆడిస్తూ పరీక్షగా చూసింది. కొండడి పట్టువిదిలించుకుంటూ కుప్పించి బాణంలా దూసుకుంటూ చిలకమీద రివ్వున పడింది. అరుస్తూ రెక్కలు కొట్టుకొంటూ గోళ్ళతో ఒంటిమీద చీరని చింపేస్తోంది.

చిలక గావుకేక పెట్టిపారిపోబోయింది. డేగ గోళ్ళలో చిక్కుకున్న చీర ఒంటి మీద నుంచి ఊడిపోయింది. డేగకి చెయ్యి అడ్డం పెట్టుకుంటూ మూలన దాక్కొంది.

కొండడు నోటితో ఈలలు వేస్తూ, లొట్టలు కొడ్తూ డేగని అతికష్టం మీద అదిమిపట్టుకున్నాడు. అది రోషంతో రొప్పుతోంది. ''ఇంట్లో కొత్త ముఖం సూస్తే మీద పడిపోతాది. బకిరీ లేదు కదా'', అంటూ చిలక దగ్గరకు వెళ్ళి హఠాత్తుగా ఆగిపోయాడు.

చీర విడిపోయిన చిలక నగ్నంగా మూలన ముడుచుకొని సిగ్గుతో తలుపుచాటున నిల్చునుంది. ''చీరిచ్చెయ్యి'' అంది చిలక.

తాటిస్తూ వెనక్కి తిరిగి చూడకుండా గబ గబ నడుచుకుంటూ అక్కడ నుంచి విసురుగా వెళ్ళి పోయాడు.

కొండడు సొమ్మసిల్లి పడున్నాడు. నడి నెత్తిన సూర్యుడు చుర్రుమంటున్నాడు. కొండడి చూరుమీద నుంచి జారి గుడిసెలో పడుతున్న ఎండపొడ వెలుగులో, సిగ్గుతో పొంగి ఎగిరి పడు తున్న చిలక గుండెలు బింకంగా మొనలుదేరి నున్నగా మెరుస్తున్నాయి. గుడిసెలోని మసక నీడలో అవయవాల పొంకం పిట పిట లాడుతోంది. కొండడి చీపి కళ్ళు శరీరం వంపుల్ని మత్తుగా చూస్తు న్నాయి.

''చీర ఇచ్చెయ్యమంటేనూ!'' కీచు గొంతుకతో కస్సుమంది. కాళ్ళు నేలమీద బాదుకొంటూ. కొండడు తుళ్లిపడి చీరని చిలక మీదకి విసిరాడు. అమాంతంగా అందుకొని ఆదరా బాదరాగా కప్పు కొని నుదిటి మీద చెమటని ఎడమచేత్తో తుడుచుకొంటూ ముఖం మీద జీరాడుతున్న జుత్తుని సర్దు కుంది.

''గొప్ప డేగని పెంచావ్, కంతిరీ పిట్ట. ఆడదాని చీర విప్పేస్తోంది.''

''నయం, నీ చర్మం ఒలిచే లేదు. ఇది మామూలు డేగ కాదే. గెద్ద జాతికి చెందిన డేగ. డేగ గెద్దం టారు.'' చిలక నీళ్ళు మరగ బెడుతోంటే వాడు డేగని ఎలా పట్టుకున్నదీ, ఎలా మచ్చిక చేసు కొన్నదీ వివరాలు చెబుతున్నాడు.

''వలలో చిక్కుకోగానే గెద్దేమో అనుకున్నాను ముసల్ది చూసి, ఓర్నాయినా, ఇది గెద్దకాదురా, గెద్ద డేగ! దీనిగోళ్ళు ఇనప కొక్కాల్లాగున్నాయి చూడు, రెక్కలు కొట్టుకొంటూ చాచుకొంటూ రెండు తాటి చెట్ల ప్రమాణంలో గాలిలో తేలుతూ చక్కర్లు కొట్టగలదు. రెక్కల్తో గుద్దిందంటే పెద్ద కొంగలు కూడా సొమ్మసిల్లిపోవాలి. దీన్ని పెంచి వేట నేర్పుదాంరా– అంది. దాని కళ్ళకి నల్లటి ముసుగు తొడిగాం. తాడు ఉయ్యాలలా కట్టి దాని మీద నిల్చోబెట్టే టోళ్ళమి, ముసుగులో నుంచి కళ్ళు కనిపించక కాళ్ళతోనే తడుముకుంటూ రెక్కలు కొట్టుకుంటూ తాటి మీద నుంచి జారిపడి పోబోతూ తమాయించుకుని నిలదొక్కుకొనడం నేర్చుకుంది. కొత్తలో ఎర్రెత్తి పోయినట్లు చికాకు ఎట్టేసేది. సడయిపోతే సాలు మీదిని పడిపోబోయేది. దానికి రోజుకు రెండుమార్లు కప్ప పేగులు, మంచినీళ్ళు ఎట్టేవోళ్ళం. ఇటు చూస్తే సగం ఆకలి అటు కళ్ళకి ముసుగు, చీకటి. నానా ఇబ్బందులు ఎట్టీసిందనుకో.''

''అది ఆకలితో అవురావురుమని మేం పెట్టింది తింటుంటే, దాని రెక్కల్ని, తోకని నెమ్మదిగా నిమిరేవోళ్ళం. కొత్తలో తిరగబడేది. రాను రాను అలవాటు పడిపోయింది. అలాగ కళ్ళు కట్టి సరిగ్గా పది పదిహేను రోజులు ఉంచాం చీకట్లో. ఆ తరువాత రోజుకి కొంచెం కొంచెం వెలుగుచూపిస్తూ మమ్మల్నిసూడనిచ్చే వోళ్ళం. ఇంత మెడ్డువారీ పిట్ట రానురాను గోలపెట్టక నిమ్మళంగా పావురం పిట్టలాగ మచ్చికయి పోయింది. తరువాత ముసుగు తీసేశాం. లొట్టలు కొట్టి సొంజ్ఞలు మప్పాం. చేతిమీద, వీపుమీద ఎక్కించుకుని గొలుసుకట్టి తిప్పాం. చచ్చిన ఎలక పిల్లల్ని తాడుతో ఈడ్చు కుంటూ గజిబిజిగా పరుగెత్తు తూంటే దాన్ని తన్నుకుంటూ వెంట ఎగురుకు వచ్చేది. ఇప్పుడు రాటుదేరి పోయింది. కొత్తలో ఏట చేసిన పిట్టని ఒగ్గేది కాదు. అదే కలబడిపోయి తినేసేది. దానికి మెల్లిగా తొండ పిల్లల్ని, కప్పల్ని చేతిమీద పెట్టుకుని ఎరగా ఊరించేవాళ్ళం. అప్పుడు ఏట చేసిన

చేసిందంటే ఉరుకులు పరుగులు మీద వచ్చి మీద వాలిపోద్ది బక్కీసు కోసం. తొండపిల్లని సిద్ధంగా ఉంచాలి.''

''సీకట్లో ఏటాడుద్దా?'' అంది పొయ్యి మీద కుండ దింపుతూ చిలక.

''మరీ సీకట్లో కాదు. ఎన్నెల్లో ఏటసేస్తాది. డేగలు, బొల్లి గెద్దలు మాత్రమే ఎన్నెట్లో ఏట సెయ్య గలవు. మరేం బయం నేదని పూరా నిబ్బరం ఉంటేనే ఎన్నెల్లో ఏటకి దిగుతాయి. అందు లోనూ దీనికి చిన్నప్పుడే చీకట్లో మిణుగురు పురుగులు పెట్టి ఆ వెలుగులోకి దాని కళ్ళుకు అలవాటు చేశాం. అందుకే వెన్నెల్లో వాటంగా వేటాడగల్దు.''

ఆ డేగ కథ మొదట్లో ఆసక్తిగానే విందిగాని తరువాత పట్టించుకోలేదు. మాట ఆపేసరికి ''సరే గాని బొమ్మళ్ళ పడుకో కావడం పెడతాను'' అంది చిలక.

కొండడు బోరగిల పడుకున్నాడు. కమ్చీ దెబ్బలు కమిలిపోయి నల్లగా చారలు దేరున్నాయి. ఆవిరి చురుక్కు చురుక్కు మని తగుల్తుంటే ఉలిక్కి పడుతున్నాడు.

''అది సరేగాని, సిలకా; దొంగతనం ఎందుకు చేశావే?''

''ఆడ్నిసూస్తే ఒల్లు మంట. కొండల్లో ఏం పిడత పనిచేసి ఒచ్చిశాడోగాని ఇక్కడ ఆడి దుర్మార్గా నికి అంతులేకుండా పోతుంది. వడ్డీలకు వడ్డీలు మూట కట్టుకొని ఎందర్ని ముంచేశాడో. ఎందరి భూములూ, పుట్టల్ని ఆక్రమణ చేసుకున్నాడో, దానికితోడు ముసలినాకొడుక్కి మోజారీతనం జాస్తి. ఊ అంటే కొట్టడం, ఆ అంటే కొట్టడం వయస్సు ముదిరిపోతున్నా సోకుసూపులూ, పోకిరీ ఎటకారాలూ ఎక్కువైపోతున్నాయి. ఎప్పుడోగాని నేనే గట్టిగా కర్చుకిచ్చు కుంటాను. ఒక్క పాలి బుర్ర గింగుర్లెత్తి పోవాలి.''

''పెద్దబాబు ఈ ఊరికి పెద్దకాపు. ఆ బాబుతో నీకెందుకే జెట్టీలు. మావుల్లో చేపల్ని దొంగ లాట్టం. ఛీ ఛీ.''

''నువ్వు కుక్కనాటోడివి. వుత్తి పుణ్యానికి దెబ్బలుతిన్నావు. ఆడ్ని పెద్దబాబు, పెద్దకాపు అంటున్నావు. ఆడ్ని తిక్కరమక్కర పెట్టాలనిగాని, ఆడి సేపలు ఎవడికి కావాలి. ఆడు ఎందర్ని దోచుకుపడేసుకుంటున్నాడో, ఆడి మావుల్లో సేపల్ని నేను దొంగలాడ్తే మరేంతప్పులేదు. ఆ సేపలు ఆడు పెంచిన వేటి? పోనీ ఆ పాపం నన్నే కొట్టీనీ, మద్దిన నువ్వు దెబ్బలు తిన్నావు.''

''అది నా కరమమే!'' అని ఎక్కడికో చూస్తూ కళ్ళు మూసుకున్నాడు.

ఎండవేడి తగ్గినా కొండల్లోంచి వీస్తున్న వడగాలి తాటి మట్టల్ని రాసుకుంటూ మొగలి పెండెల్లో నుంచి వీస్తూ నీటిమీద పడి చల్లబడి తెరలు తెరలుగా వీస్తోంది.

కొండడికి కాపడం పూర్తిచేసింది చిలక. దెబ్బల బాధ చాలామటుకు ఉపశమించింది. లేచి కూర్చున్నాడు.

''ఎప్పుడూ లేదు ఈ కాలంలో ఇంత వేడి గాలి. శీతకట్టు తిరిగినా ఇంకా పగలు ఎండలు పేల్చేస్తున్నాయి. చీకటి పడగానే మళ్ళీ చల్లబడిపోయి రాత్రి ముదురుతున్న కొద్దీ చలేస్తోంది. శీతకట్టుకి అక్కడక్కడ వలస పిట్టలు కూడా దిగుతున్నాయి.'' అన్నాడు కొండడు.

''ఈ ఎండలకి ఈ ఏడు పంటలు పోయాయి. వర్షాలు లేవు. ఇప్పుడు ఒకటి రెండు దుక్కులు

పిట్టని మా ముందు ఒగ్గేసి పడేసి చేతిమీద వాలి తొండని పొడుచుకు తినడం నేర్చుకుంది. వేట వర్షాలు పడినా మెరక పంటలకి ఇత్తనాలు జల్లొచ్చు. అందుకే వర్షాల కోసం ఎల్లుండి పున్నానికి జాతర చేస్తున్నారు పెద్దపల్లెలో''

''అదెక్కడ?''

'' ఓస్, అదెరగవా. బోడికొండ కావల కోసుడుంటాది. పెద్ద పరస అవుతాది. మన వూరంతా ఎలుతున్నారు. నువ్వూ రారాదూ?''

''ఇక్కడ కాపలా ఎవడుంటాడే, నేను సంబరాలూ. పులేసికాలు సూస్తే ?''అన్నాడు.

''అయితే రావా? నీనూ ఎల్లనూ....''

''నానూ ఎల్లనూ నువ్వూ ఎల్లవూ....''

''మరిక్కడికి ఎలిపోచ్చి......రాకూడదంటే?''

''ఏటీ? .....ఎందుకూ?....'' వచ్చేస్తున్న కోపాన్ని సముదాయించుకుంటూ అంది. తనని నగ్నంగా చూసిన కొండడి ఆవురు గొట్టుకుపోయిన చూపులు ఆమె మనసులో మెదుల్తున్నాయి.

''ఎన్నెల్లో చేపల వేటకి బయలుదేరుదాం. మావుల్లో చేపల్ని దొంగలాట్టం నీకెందుకే. ఈటెతో చేపలవేట చూపిస్తాను. గండు చేపల్ని పొడిచి నీట్లో నుంచి తీస్తాను. చూసి గచ్చయి పోతావు.''

'' అమ్మో, మా యమ్మ సంపెయ్యదూ?''

''సంబరానికి వెళ్తానని బయలుదేరి దార్లో టక్కర కొట్టేసి ఇటు పారొచ్చి. కేటు గుంటవి . ఆ ఒడుపులు నీకు చెప్పాలేంటే?''

''ఇందాకటి నుంచీ ఇంటున్నాను. ఏటే? ఏమే, గుంటా, గింటా అంటున్నావు.... ఏటి సంగతి? నీ పెళ్ళాన్ననుకుంటున్నావా?'' అంది అకస్మాత్తుగా.

ఆ తెచ్చిపెట్టుకున్న కోపానికి కొండడు జంకలేదు.

''పెళ్ళాడితే పెళ్ళానివవుతావు. అవ్వా?'' అన్నాడు కొండడు.

''నాను చేపల బొట్టిని, నువ్వు కొండోడివి ఎలా పెళ్ళవుద్ది? ఎవరు చేస్తారు.''

''ఒకళ్ళు చేసేదేమిటే!...సూరీడు. సెంద్రుడు. ఇంత పెద్ద సెరువు మనకి సాక్షికాలు.''

''నాన్జేసుకోను.''

''పోనీలేయే. ఇలాగే నిన్ను తలుసుకుంటూ చిక్కిపోయి, సివికిపోయి, ముసిలైపోయి పడవలో ఎప్పుడో ఈ సెరువులోనే సచ్చిపోతాను.''

''అబ్బే!'' అని కొండడి బుగ్గమీద ఓ పోటు పొడిచి కిసుక్కున నవ్వింది.

''డేగని ఒగ్గీసిదేంటి?'' అన్నాడు కొండడు.

పకపక నవ్వింది. విరగబడి నవ్వింది. గుడిసెలో నుంచి ఊరివైపు వెనక్కి తిరిగి చూసుకుంటూ పరుగెత్తింది.

సాయంకాలం అవుతోంది. గాలి కెరటాల్లో చిలక నవ్వులు దూరం అవుతున్నాయి.

## 7

వెన్నెలలో చేపల వేటకి బయలుదేరాడు కొండడు. భుజం మీద డేగ నిల్చునుంది.

పడవలో కూర్చున్న చిలక కొప్పులోని ఎర్రమందారం మీద మంచుబొట్లు చంద్రకాంతిలో ముత్యాల్లా మెరుస్తున్నాయి.

శరద్రాత్రి, పున్నమి, జామున్నర, చంద్రుడు నిర్మలాకాశంలో దేదీప్యమానంగా ఊగుతున్నాడు. మంచులో నుంచి వెన్నెల వడపోతగా కురుస్తోంది. నీటిపొదల్లో నుంచి రివ్వున వీస్తున్న తేమగాలిలో, మంచులో తడిసిన నాచు వాసనలు తేలుతున్నాయి.

సుదూరంగా జాతరలో వాగిస్తున్న డప్పులు, కొమ్ము బూరలు రాత్రి నిశ్శబ్దంలో అప్పుడప్పుడు స్పష్టాస్పష్టంగా వినిపిస్తున్నాయి.

గెడలు వేస్తున్న పడవ నామని తోసుకుంటూ జివ్వున నడుస్తోంది. కొండడి భుజం మీద డేగ విశాలమైన సరస్సు మీద చేపల కోసం పరిశీలనగా తలని నిక్కించి ఎగిరెగిరి చూస్తోంది. తుంగగడ్డిలో నుంచి క్రాంక్ మని సన్నని వెదురు గొట్టంలో నుంచి అరిచినట్లు పాములనారి బొంగురుగా అరుస్తూ లేచి విశాలమైన రెక్కల్ని కొట్టుకుంటూ నీటిని తాకుకుంటూ ఎగిరి పోయింది.

వెన్నెల ప్రతిఫలిస్తున్న నీటి మీద, నాచులో నుంచి బురద ఉబికినట్లు మట్టి నీరు సుడులు తిరిగి నీటిని కెలుకుతూ గళ్ళున విరిగింది. ఆ నీటిలో గండు చేప కదలిక తళుక్కున మెరిసింది.

కొండడు అప్రయత్నంగా గెడవేసి ఆపాడు.

''ఎందుకు ఆపావ్''? ప్రశ్నించింది చిలక.

భుజంమీద డేగ ఉద్రేకంతో కొండడి భుజం మీద కాళ్ళతో తొక్కుతోంది.

''క్లిక్ క్లిక్'' మని సన్నగా నాలికతో పిట్టఅరుపులా లొట్టలుకొట్టి ఎడమచేతిని గాలిలో ముందుకు చాచాడు. డేగ భుజం మీద నుంచి చేతిమీదికి వాలింది. రెక్కల్ని ముడుచుకుని మెడమీద జూలు వెంట్రుకల్ని దులపరించుకుని ఆతృతతో నీటిమీద కదలికను పరిశీలిస్తోంది.

''శ్! ఇంగిలం చేపని పసిగట్టి నట్టుంది'' అని నిశ్శబ్దంగా ఉండమని చిలక్కి సౌంజ్ఞ చేశాడు.

పిండారబోసిన వెన్నెలలో చేతిమీద డేగతో, చీకటితో చెక్కిన శిల్పంలాగ కొండడు పడవ మీద నిల్చొనున్నాడు. మెడమీద గగుర్పొడిచిన డేగ తెల్లటి వెంట్రుకలమీదా కొండడి కొనతేరిన సున్నటి ముక్కుమీదా వెన్నెలపొడ తీర్చిదిద్దినట్లు మెరుస్తోంది.

డేగ కుప్పించి కొండడి చేతి మీది నుంచి రివ్వున గాలిలోకి ఎగిరిపోయింది. గాలిలో తేలుతూ రెక్కలు కొట్టుకొంటూ అంచెలంచెలుగా ఎత్తుకి లేస్తోంది. ఎత్తు పుంజుకున్న తరువాత నీటిమీద దృష్టిని కేంద్రీకరించుకుంటూ రెక్కల్ని నిశ్చలంగా చాచుకొని వలయాకారంగా తిరుగుతోంది.

కొండడు డేగ ఎత్తుగడల్ని కనిపెడ్తున్నాడు.

అలా ఎగురుతున్న డేగ క్షణం సేపు గాలిలో ఒక దగ్గరే నిలబడిపోయింది. అంతే. రెప్పపాటులో అంత ఎత్తునుంచి మెరుపు మెరిసినట్లు గుబిల్లుమని నీటిని ఢీకొంది. ఆ తాకిడికి నీరు ఉవ్వెత్తుగా చిమ్ముతూ లేచింది. రెక్కలు నీటిమీద దబ దబ కొట్టుకుంటున్నాయి. నీటిలో గోళ్ళలో చిక్కుకున్న చేప గిలగిలమని తన్నుకొంటోంది. మరుక్షణంలో డేగ చేపతో నీటి మీద నుంచి లేచింది. దాని గోళ్ళలో చిక్కుకొని వేళ్ళాడుతూ చేప గింజు కొంటోంది. డేగ ఆ బరువును రెక్కలు కొట్టుకొంటూ కాచుకొంటూ పడవ మీదికి దూసుకు వస్తోంది.

''భేషో'' అంటూ చేపని వేటాడి తెచ్చిన డేగకి పారితోషికంగా ''ఇదిగో అందుకో'' అన్నట్లు బుట్ట లోని తొండ పిల్లని డేగకి చూపించాడు. పడవలో దభీమని చేపని పడేసి తొండపిల్లని ముక్కున కర్చుకొని పడవ అంచుమీద ఎగిరి కూర్చుంది డేగ.

పడవలో ఇంకా కొన ఊపిరితో తన్నుకుంటున్న ఇంగిలం చేపని బుర్రమీద వాటంగా అదిమి పట్టుకొని బరువుగా ఎత్తిబుట్టలో వేసుకొన్నాడు.

డేగ తొండ పిల్లను చీల్చుకొని పీక్కు తింటోంది.

క్షణంలో ముగిసిన ఈ వేటని కలలో చూస్తున్నట్లు నివ్వెరపోయి చూస్తోంది చిలక.

''మరీ పెద్దది కాకపోయినా ఒక మాదిరి చేప'' అని చిలక్కి చెబుతూ విజయగర్వంతో ప్రశంసా పూర్వకంగా డేగవైపు టప టప లొట్టలు వేశాడు. యజమాని ప్రశంసలకు ఉబ్బిపోయినట్లు డేగ ఒళ్ళు పొంగించుకొంటూ కిర్, కిర్ మని ముద్దుచేస్తోంది.

రాత్రి అవుతున్న కొద్దీ సముద్రం మీద లేచిన గాలులు సరస్సు మీద ప్రయాణం చేస్తూ తెరలు తెరలుగా వీస్తున్నాయి. గాలిలో తేలుతున్న ఉప్పదనం కొండడి పెదాల్ని తాకుతోంది.

''సముద్రం పోటెత్తుతోంది కాబోలు''- అనుకున్నాడు మనసులోనే.

తిరిగి గెడేసాడు. పడవ బరువుగా నడుస్తోంది. పెద్ద పల్లెలోని జాతర్లో డప్పులచప్పుడులు అప్పు డపుడు దూరంగా వినిపిస్తున్నాయి. పడవ చప్పుడు తప్పించి అంతా నిశ్శబ్దం. జమ్ము గడ్డి గుబుర్లలో గాలి బుడగలు లేచి చిట్లుతున్న చప్పుడు సన్నగా వినబడింది. ఉండుండి మళ్ళీ వినబడు తోంది ఆ నిశ్శబ్దంలో.

''ఏదో పెద్ద చేపే. పెద్ద బుడగల్నే వదులుతున్నట్టుంది అటు పద ''అంటూ కంగారుగా ఆత్రుతతో అంది చిలక.

క్షణం సేపు చెవి నిక్కించి బుడగలు చిమ్ముతున్న చప్పుడిని విన్నాడు కొండడు.

''అవును. ఇవి గడ్డిలోని బుడగలు కావు. నీటి అడుగు నుండి వస్తున్నాయి. తొందర తొందరగా వస్తున్నాయి. మరీ లోతులో లేదు. ఈటె పోటుకి దొరుకుతాది'' అని పడవని సడిచెయ్యకుండా గెడెయ్యకుండా వదిలాడు. పడవ గాలికి తేలుతూ కదుల్తోంది. పడవకి ప్రక్కనే అందుబాట్లో గుడ గుడమని బుడగలు గుంపులు గుంపులుగా లేస్తున్నాయి. ఆ నిర్జన ప్రదేశంలో ఒళ్ళు జల్లు మంది చిలక్కి.

కొండడు ఈటె తీశాడు. ఇనప మొన పదును చూసి ఉమ్మి తగిలించాడు. బుడగల్లో నుంచి నీటిలోకి చీపి కళ్ళని మరింత కుదించుకుంటూ చూశాడు. నీటిలో ప్రతిఫలిస్తున్న వెన్నెట్లో నాచు మొక్కల సందుల్లో నుంచి బురద నేల గజిబిజిగా కనిపిస్తోంది. నాచు మొక్కల్లో నుంచి బుడగలు వస్తున్నాయి. ఇంకా తీక్షణంగా చూశాడు... నల్లటి నాచు మొక్కల మధ్యలో మరింత నల్లటి నీడ కదులుతోంది - నీడ...బుడగలు.... ఈటె సర్దుకున్నాడు. నీట్లోకి మెల్లగా చప్పుడు కాకుండా దించుతున్నాడు.... నీడ కదులుతోంది...నాచు మొక్కల నుంచి లేస్తోంది. ... నీడ.. పెద్ద నీడ తల. కొండడు ఊపిరి బిగబట్టాడు. కాళ్ళు నిలదన్నుకున్నాడు. బలాన్ని కేంద్రీకరించుకొని రెండు చేతులతోనూ ఈటెను కదులుతున్న నీడ తలమీదికి కసుక్కున దింపాడు. ఈటె మొన గునపంలా బురదలోకి దూసుకుపోయింది. నీటి అడుగున పెద్ద సంచలనం. ఈటె ఊగిపోతోంది. చటపట చటపట మని నీళ్ళలో అలజడి. కొండడు అలానే అదిమి పట్టి ఉంచాడు. చిలక కొండడి పక్క చేరి తోసుకువచ్చింది. విరహాగ్నితో ఆవురావురుమంటున్నట్లు తపించి పోతూ నురుగులు కక్కుకుంటూ వచ్చిన ఆ కెరటపుటల ఆ సరస్సును పెనవేసుకుని ఉక్కిరిబిక్కిరైపోతూ తోసుకు వస్తోంది.

నీటిలోకి చూస్తోంది. రాను రాను నీరు చేప రక్తంతో రంగు మారుతోంది. చిక్కటి నల్లటి చారలు నీటి మీద చిమ్ముతున్నాయి. .. నెత్తురు బుడగలు. నీటిలో కలవరం ఆగిపోయింది.

కొండడు బలం పూర్తిగా కూరుకుపోయిన ఈటెని బురదలో నుంచి లాగి గాలిలోకి ఎత్తి పట్టు కున్నాడు. ఈటెకి గుచ్చుకొని వేలాడుతూ గిలగిల తోక కొట్టుకొంటోంది పెద్ద చేప. వెన్నెల్లో అది నల్లటి రాక్షసి చేప పిల్లలా ఉంది. నల్లటి తోక చివరన రక్తపు జాలు రంగు. తాటి దిక్కిడి. మంచినీటి చేపల్లో శ్రేష్ఠమైంది.

చిలక ఆనందానికి అంతులేదు. ఉబలాట పడిపోతోంది. ఈటె మీది నుంచి చిక్కటి చేప నెత్తురు జారి నీట్లో బొట్లు బొట్లుగా పడుతోంది.

నెత్తురు వాసన తగిలిన డేగ పడవలోంచి ఎగిరి చేపని అందుకోబోతోంది. కొండడు మరో తొండ పిల్లని అందించి సముదాయిస్తున్నాడు. అతి కష్టంమీద చిలక, కొండడు కలిసి బాణం మొన లాంటి ఈటె మొనలోకి దిగబడిపోయిన చేపని బైటకి లాగి బుట్టలో పెట్టారు.

'' వెన్నెలకి సంద్రం పోటెక్కుతోంది. సెరువులో ఉప్పునీరు పడింది. మంచినీటి సేపలు ఉప్పు నీట్లో వుండలేవు. అందులోనూ తాటి దిక్కిడులు ఉప్పునీరు తగిల్తే మరి మసల్లేవు. ఎర్రెత్తి పోతున్నట్టు ఈదుకుంటూ ఇటు దిగిపోతున్నాయి. నాచులో దాగుండిపోతున్నాయి. తుంగకాడల గుబుర్ల కింద చేరుతుంటాయి పద '' అని కొండడు దట్టంగా పెరిగిన జమ్మిపొదలు తుంగగుబుర్లలోకి పడవని తిప్పాడు.

చిటపటలాడుతున్న తుంగకాడల్ని తోసుకుంటూ జమ్మిగడ్డి మధ్యన పడవ నడుస్తోంది.

ఆకాశంలో చంద్రుడు నడినెత్తినున్నాడు. ఒడ్డునుండి లోతు తక్కువ చోట పడవపోతూ ఉండడం వల్ల కొండడికి పడవ నడపడం కష్టంగావుంది. ఎత్తుగా లేచిన పొదలు, గరుకు గడ్డి కొండడి ఒంటిని గీరుకుంటున్నాయి. తుంగకాడలు ముఖానికి తాకుతుంటే చెయ్యి అడ్డం పెట్టుకుంటూ వాటి నుంచి తప్పించుకొంటోంది చిలక.

సముద్రం హోరు దూరంగా నిశ్శబ్ద వాతావరణంలో భోరున విలపిస్తున్నట్లుంది.

తేమ గాలులు సముద్రంలోంచి లేచిన గాలి దెయ్యాల్లా సరస్సు మీది నుంచి పిచ్చిగా వీస్తు న్నాయి. తీరాన్ని ఢీకొంటున్న సముద్రం అలల గర్జనలు సరుగుడు తోటల్లోంచి వినిపిస్తున్నాయి.

తుంగపొదల్లో ఇరుక్కున్న గెడని బురదలోంచి తీయడానికి కొండడు తంటాలు పడు తున్నాడు. కొండడికి సహాయం చేద్దామని చిలక లేచి గబగబ అడుగులేస్తూ కొండడిని సమీపించ బోయింది . పాకుదేరిన పడవలో సర్రునకాలుజారి తొట్రుపడుతూ కొండడి మీద దబాలున పడిపోబోయింది. చిలకని పడిపోకుండా అదిమిపట్టుకున్నాడు కొండడు. చిలక సిగ్గుతో కెవ్వున అరిచింది. గాలికి పైట తొలగి రెప రెప కొట్టుకొంటోంది. చిలక యౌవనపు బింకం కొండడి గుండెల మీద ఎగసుకుంటూ బిగుసుకు పోతోంది. కొండడిలో అణుచుకుంటున్న కోర్కె ఒక్కసారి పురులు విప్పుకుంది.

వెన్నెల తాపానికి కాగిపోతూ పోటెక్కిన సముద్రంలో నుంచి కైపెక్కిన కెరటం మహోధృతంగా లేచి తీరాన్ని ఢీకొంది. ఆ శబ్దానికి సముద్రపు కాకుల గుంపు అరుచుకుంటూ లేచింది. కెరటం కట్టల్ని తెంచుకుంటూ, ఇసుక మేటల్ని కోసుకుంటూ, పొర్లుకుంటూ సరస్సులోకి ఉప్పెనలా

తుంగపొదలు, గడ్డి దుబ్బుల్లో నించి లుంగలు లుంగలు చుట్టుకుంటూ ఎగిరెగిరి ప్రవహిస్తోంది.

పడవలో చిలక కైపుకన్నులు, కొండడి వేడి నిట్టూర్పులు, పెనుగులాటలు, మెత్తటి మూల్గులు, కదిలే నీటిలో పడవ ఊగిస లాటలు. ఆకాశం మీద వెన్నెలకి కరిగిన మంచు ముద్దలు ముద్దలుగా కురుస్తున్నట్లుంది. తుంగ గుబుర్లలో నుంచి ప్రతిఫలిస్తున్న వెన్నెల నీడలు చిలక నున్నని తొడల మీద ఊగుతున్నాయి. జమ్మిగడ్డి మీద నుంచి జారిన వెన్నెల జీరల్లో రొప్పుతున్న కొండడి బుడ్డ పెదాలలోంచీ వచ్చే ధ్వని మదించిన అడవిదున్న బుసలు కొడుతున్నట్లుంది.

సముద్రపు నీటి తాకిడికి రాను రాను నీటి మట్టం పెరుగుతోంది. సరస్సు పొంగుతూ ఆయాసం గా ఊపిరి పీలుస్తున్నట్లు భారంగా లేచి పడ్తోంది. చెలరేగిన అలలు సరస్సు ఒడ్డును కతుకుతున్నాయి. సాగర సంగమం ఒరిపిడిలో పొంగులు తేలుతున్న సరస్సు మెత్తగా మూలుగు తున్న వింత ధ్వని.

ఆకాశంలో చుక్కలు, ఆ చుక్కల తోడు చంద్రుడు; ఆ మహాసంగమ దృశ్యాల్ని, సౌందర్యాన్ని ఆనందంతో విలోకిస్తూ ఆశీర్వదిస్తున్నట్టున్నారు.

గెడమీద కూర్చొని చూస్తున్న డేగ, సరస్సు మీద పొంగులకి తుంగ గుబుర్లలో నుంచి మెల్లగా లేస్తూ పడుతున్న పడవ విన్యాసాన్ని అతి వింతగా చూస్తోంది.

నడిరేయి దాటింది. చంద్రుడు నడినెత్తి మీది నుంచి పడమటి దిశకు దిగుతున్నాడు. గెడమీద డేగ టపటపమని రెక్కలు కొట్టుకుంటూ లేచింది. పడవ చీకటి గుబుర్లలో నించి సిగ్గుపడుతూ బయటకు వచ్చింది.

కొండడు గెడేస్తున్నాడు. పడవ మత్తుగా వెన్నెలలో నడుస్తోంది. పడవ చివరన కూర్చున్న చిలక చేత్తో నీళ్ళని తాకుతూ పడవ కదలికతో వయ్యారంగా ఊగుతోంది. ఎవరూ మాట్లాడటం లేదు. మధురానుభూతులతో మనస్సులు మూగవోయాయి. క్షణాలు యుగాలుగా దొర్లుతున్నాయి.

★ ★ ★

కొండడు గుడిసెవైపుకు పడవని మళ్ళించాడు. ''పోదామా'' అన్నాడు.

''ఛీ, పో!''... అంది సిగ్గుతో చిలక.

ఒడ్డున తీతువు పిట్టల జంట టిట్టిటిటీవ్ టిట్టిటిటీవ్ మని అరుచుకుంటూ గోల చేస్తున్నాయి. ఆ అరుపుని అందుకున్నట్లు అన్నివైపుల నుంచి తీతువులు అరుచుకుంటూ లేస్తున్నాయి. కొండల మలుపుదగ్గర నీటి పిట్టల గోల దూరంగావినిపిస్తోంది. రాను రాను సరస్సు మీద ఆ అరుపులు అన్నివైపులా విస్తరించుకుంటున్నాయి.

ఆ సందడికి కొండడు ఆశ్చర్యపడుతూ దిక్కులు చూశాడు. ఆకాశంమీద నల్లటి చుక్కల్లాంటి ఆకారాలు, కొండల్ని దాటుకుంటూ వస్తున్నాయి. అవి నీటి బాతులు. బాణం మొన ఆకారంలో తీర్చినట్లు గుంపులు గుంపులుగా వస్తున్నాయి. చూస్తుండగానే నల్లటి చుక్కల మందలు వెన్నెల్లో పరుచుకుంటూ ఆకాశాన్ని కమ్మేస్తూ నల్లటి మేఘంలా దగ్గరవుతున్నాయి.

తాకుతూ ఉల్లాసంగా పరుగు తీస్తోంది. పల్లె దగ్గరౌతున్న కొద్దీ పరుగు ఆపి నడక ప్రారంభించింది. పల్లెలో చంటిపిల్లల ఏడుపులు వినిపిస్తున్నాయి. బెస్తపల్లెకి కొంచెం దూరంగా ఊరు చివర తాటిచెట్లు మధ్యలోని పెద్ద కాపు ఇంట్లో లాంతరు గుడ్డిగా వెలుగుతోంది. దారిలో మర్రిచెట్టు దాటితే జీడి

ఇద్దరూ వెన్నెల మీద తేలుతున్న నల్లటి మబ్బులా వస్తున్న నీటి బాతుల్ని చూస్తున్నారు. రాను రాను దగ్గరౌతూ పెద్దవౌతున్నాయి. రెక్కల ఝూంకారం, వలస పిట్టలకి స్వాగతం పలుకుతున్నట్లు నీటి మీద పక్షి సంతతి గోలగా అరుస్తున్నాయి. వందల సంఖ్యలో కుమ్ముకుంటూ వస్తున్నాయి. సరస్సు మీదికిరాగానే వాటి అరుపులూ మొదలయ్యాయి. 'కార్.. బార్ బార్ బార్ హాంక్' వింత వింత అరుపులు. ''బాతులు, గూడ కొంగలు, ఎర్రబుర్రలు, గూసుబాతులు'' దగ్గరౌతున్న వాటి ఆకారాల్ని దూరం నుంచే చూసి చిలక్కి చెపుతున్నాడు.

ఆకాశాన్నించి దిగుతూ క్రమ్ముకుంటూ వెన్నెలని కప్పేస్తున్న చిక్కటి చీకటి తెరల్లా సరస్సు మీద బాతుల మందలు దిగుతున్నాయి.

రెక్కల చప్పుడు, అరుపులతో పరిసర ప్రాంతం దూరంగా వినిపిస్తున్న సముద్రపు హోరుతో కలిసి గింగురులెత్తిపోతోంది.

కొండడి పడవ మీది నుంచి బాతుల మందలు ఎగురుతూ దిగడానికి రెక్కలు కొట్టుకుంటూ గాలిలో పరుగులు తీస్తున్నాయి. కొండడు, చిలక తలలెత్తిచూస్తున్నారు. వాళ్ళమీది నుంచి రెక్కల నీడలు, నీడల సందుల్లోంచి దోబూచులాడుతున్న వెన్నెల. వెన్నెల వెలుగులో తళుక్కు మంటున్న తెల్లటి రెక్కలు, నీచు వాసనలు, వెడల్పాటి చర్మపు పాదాలు, చాచుకొన్న మెడలు, వంకలు తిరిగిన ముక్కులు, తలల మీది నుంచి వలయాకారంగా జువ్వున విసురుగా తిరుగుతూ, నీటి మీద దిగుతూ, లేస్తూ, ముక్కులతో పొడుచుకుంటూ, తరుముకుంటూ- గోల చేస్తున్నాయి

అందమైన కల రెక్కలు తొడుక్కుని ఆకాశం మీది నుంచి సరస్సు మీదికి దిగినట్లుంది చిలక్కి.

పిట్టల అలికిడికి రెచ్చిపోతూ కలబడి పోవాలని ప్రయత్నిస్తున్న డేగని అతి కష్టం మీద అదిమి పట్టుకొని చేతిమీద గొలుసుతో కట్టుకున్నాడు.

''డేగని ఒగ్గెయ్యి హెయ్'' అంది చిలక.

''ఇవి పెద్దరకం బాతులు. దెబ్బతియ్య లేదు. రేపు వలేసి పట్టుకుందాం. ఈ రోజుకి సరి. పోదాంపద, రాత్రి చాలా దాటిపోయింది. చుక్కమ్మ జాతర తెల్లారేసరికి అయిపోద్ది. ఆళ్ళు ఇల్లు చేరేసరికి నువ్వు ఇంట్లో ఉండాలి, పద. '' అని పడవని వడివడిగా గెడవేస్తూ ఒడ్డుకు చేర్చాడు. ఒడ్డున బురదలో గెడ నిలిపి పడవని తాడుతో కట్టాడు. ఇద్దరూ గుడిసె వైపు వెళ్ళారు.

''రేపు మద్దేనానికిరా, చేపలు వండి ఉంచుతాను'' అని అన్నాడు, చిలక బుగ్గ మీటుతూ.

''నేను రాను, ఫో!'' అంటూ నవ్వింది.

''చిలకా, నువ్వు సముద్రపు చిలక నాగుంటావే !'' అన్నాడు.

చిలక విరగబడి నవ్వింది. ''సముద్రపు చిలకా!... నేనా...ఎర్రటి కాళ్ళు, తెల్లటి ఒళ్ళు. ఛీ .. నల్లటి కోయిల్ని... కూస్తాను'' అంటూ 'కూ' మని కూసింది. వెక్కిరించింది. వికావికలై నవ్వు కుంటూ పరుగెత్తుకుంటూ పొలాల గట్ల మీద నుంచి పల్లె వైపు దౌడు తీసింది.

కొండడి గుండెల్లో కోటి రెల్లుపూలు వికసించినట్లయింది. చలిగాలి రివ్వున వీచింది. కొండడు గుడిసెలోకి పోయి తలుపు లాక్కున్నాడు.

★ ★ ★

చిలక పరుగెత్తుతూ చిన్న కూని రాగాలు తీస్తోంది. చేత్తో పిచ్చి మొక్కల్ని, గోగుపువ్వుల్ని

తోట. దాని నానుకునే ఉంది బెస్తపల్లె. అందులో రెండో వరసలో ఉంది చిలక ఇల్లు.

చిలక మర్రి చెట్టుకిందకి వచ్చింది. ఊడలు దిగిన చీకటి నీడల క్రింద నడుస్తూ చెమటపట్టిన ముఖాన్ని తుడుచుకుంది. చల్లనిగాలి ఒంటిని హాయిగా నిమురుతోంది. శరత్కాలం వాసనలు ఘాటుగా గాలిలో తేలుతున్నాయి.

హఠాత్తుగా చిలక గాలిలోకి లేచి పోతున్నట్లయింది. కళ్ళు చీకట్లుకమ్మాయి. ఎవరో అరిచేతో కళ్ళు గట్టిగా మూసారు. నోరు నొక్కేస్తున్నారు. గింజుకుంటున్న చేతుల్ని,పాదాల్ని అదిమిపట్టి అమాంతంగా ఎత్తుకొని తాటిపెండెల్లోకి మాయమయ్యారు. పెద్దకాపు పెరటి తలుపు తెరుచు కుంది. బయట గెడపెట్టిన శబ్దం.

''మీరు పొండి, రేపు కలుద్దాం.''

''జాగర్త బాబూ, అసలే తింగిరిది''

''దెబ్బకి దెయ్యం కూడా చీరెత్తాల'' అన్నాడు గర్వంగా పెద్దకాపు. నలుగురూ తాటిచెట్లలో నుంచి చీకట్లోకి మాయమయ్యారు.

లోపల్నించి తలుపుల్ని దబదబా కాలుతో తంతోంది చిలక. గడియతీసి లోపలకి ప్రవేశించి గడియ పెట్టాడు పెద్దకాపు. గుడ్డిలాంతరు వెలుగులో చిత్తుగా తాగిన కళ్ళల్లోనుంచి కామం బుసలు కొడుతోంది. చెమట్లు పట్టిన ముఖం వికృతంగా నవ్వుతోంది. చిలక్కి దగ్గర దగ్గరగా మీదికి వస్తున్నాడు.

''అడుగు ముందుకు పెట్టావా చీరేగలను. దొంగసవాదిగా సచ్చినోడా, నన్ను ఒగ్గుతావా లేక పోతే నీ అంతుచూస్తాను''.

''ఏటే మరిన్నూ అంత కోపం దేనికే? ఆ కొండోడి పాటి చెయ్యలేదే నేను? ఎన్నెట్లో తనివి తీరా తొక్కించుకున్నట్లున్నావు. కొండ నా కొడుకు, పూటకి ఠికానా లేని నా కొడుకు. ఆడు నీ కేటి సుఖ పెడ్తాడే. నువ్వు ఊ అను ఈ ఊళ్ళో మరో డాబా ఇల్లు కట్టిస్తాను నీ కోసం.''

''నీ డబ్బుతో వల్లేసుకోవాలని సూస్తున్నావా, ఎందరి డబ్బు ఒడిసుకుని గడించావో... థూ! ఆ కొండోడికి నీకూ సాటిరా? నా ఇష్టం. కొండోడితో పోతాను మరొకడితో పోతాను. ఒగ్గుతావా లేదా నంజకొడకా!'' అని తలుపు దగ్గరకు పరుగెత్తింది.

చెయ్యి పట్టుకొని ఒక్కలాగు లాగాడు. విసురుగా గోడకి ఢీకొని కుప్పలా పడిపోయింది. బైట తాటి చెట్టుమీద బొల్లి గెద్ద వాలింది. దాని నోట్లో పెద్ద నాగుబాము వేలాడుతోంది. చిలక పాములా బుసకొట్టుకుంటూ లేచి పెద్దకాపు ముఖాన్ని రక్కేస్తోంది. బాధతో మూల్గాడు.

గెద్ద గోళ్ళలో చిక్కుకున్న పాము గింజుకుంటోంది. గెద్దని తోకతో చుట్టేస్తోంది. బుసలు కొడ్తోంది.

''లంజకూతురా.... నీ అమ్మా... జీడిరసం పిండే గలను'' అంటూ చేతితో విదిలించి తోశాడు. చిలక వెల్లకిలా పడిపోయింది. తన మీద గెద్దలా పడబోతున్న వాడ్ని గుండెల మీద తన్ను తన్నింది.

చిలక ముఖంలో ఏవిధమైన మార్పూ గమనించని కొండడు గతుక్కుమని పోయినట్లు ''ఏంటి, ఇంటి కెల్లలేదా?'' అన్నాడు.

బొల్లి గెద్ద బాధగా అరుస్తూ రెక్కల్ని కొట్టుకుంటూ పాముని విదిలించుకొంటూ గోళ్ళతో రక్కుతోంది.

పెద్దకాపు అవమానంతో, కోపంతో, కాగిపోతూ విసురుగా లేచి గోడకి తగిలించిన కొరడా తీసి ఛెళ్ళుమని కొట్టాడు. చిలక బాధగా 'అమ్మో' అని అరిచింది. 'నీయమ్మా'.... అంటూ దెబ్బ మీద దెబ్బ కొరడాతో బాదాడు. బాధతో కళ్లు తిరిగి పడిపోయిన చిలక మరి లేవలేక పోయింది. దీపం ఆరిపోయింది. ఒంటి మీద చీర చిరుగుతోంది. కిటికీలో నుంచి వెన్నెల మసగ్గా పడుతోంది.

మృగవాంఛ–

గోళ్ళతో రక్కుతూ ముక్కుతో పాముని పీలికలు పీలికలుగా చీరేస్తోంది బొల్లి గెద్ద. రెక్కలతో బాదుతోంది. పట్టు తప్పిన పాము సొమ్మసిల్లి గెద్ద గోళ్ళలో వేలాడుతోంది.

గదిలో చీకటి – రాక్షసరతి

తెలివి వచ్చిన చాలాసేపటి వరకూ చిలక్కి ఏమీ అర్థం కాలేదు. తలుపు తీసి గుమ్మంలో నిల్చునున్నాడు పెద్దకాపు. బయట అంతా చీకటి. వెన్నెల కృంగిపోయింది. ఒంటిమీద చీర లేదు. ఒళ్ళంతా తడిమి చూసుకుంది. పెదాల మీద సారా కంపు. ఒళ్ళంతా అదోలాటి జిగురు వాసన.. నొప్పులు... చీర చుట్టబెట్టుకుని తూలుకుంటూ బయటకు వచ్చింది. పెద్దకాపు సగర్వంగా చూశాడు. చిలక పిడచకట్టిన నాలికతో ఉమ్మలేక పోయింది. తూలుకుంటూ వెళ్ళిపోయింది.

పెద్దకాపు వాకిట్లో మంచం వాల్చి పడుకున్నాడు.

బొల్లిగెద్ద పాముని విందారగించి తాటి మట్టల మధ్యలో కునుకుతోంది.

## 8

గాఢ నిద్రలో ఉన్న కొండడు తలుపు తోసుకొచ్చిన కిర్రు చప్పుడు విని కళ్ళు తెరిచాడు. కళ్ళు నులుముకుంటూ లేచి నిల్చున్నాడు. దీపం గాలికి రెప రెప లాడుతోంది. నిద్రపోతున్న డేగ కూడా వెదురు బద్ద ఉయ్యాల మీద ఉలిక్కి పడి నిల్చొంది.

ఆముదపు దీపం కాంతిలో శివమెత్తిన అమ్మవారు నిల్చొని ఉన్నట్టు ఉంది, చిలక.

''చిలకా, నువ్వా?'' ఆశ్చర్యంగా అడిగాడు. చిలక రెండడుగులు ముందుకు వేసి లోపలికి వచ్చింది. నోటమాట రావటం లేదు. కొండడి ముఖంలోకి తీక్షణంగా చూస్తోంది. చిలకని కిచకిచమని డేగ పలకరిస్తోంది. చిలక పలకటం లేదు. క్రింది పెదాన్ని కోపంతోపంటితో కసిదీరా నొక్కుకుంటూ ఉబుకుతున్న దుఃఖాన్ని అణుచుకోలేక గొల్లుమని కొండడి మీద పడిపోయింది.

''ఏటయిందే? ఏంటి... ఊరుకో...చెప్పు!'' అని చిలక భుజాలు పట్టుకుని కుదుపుతూ సముదాయిస్తూ అడిగాడు. కొండడి పట్టునుంచి విడిపించుకుని అనుమానంగా రెండడుగులు వెనక్కి వేసింది.

''నన్ను ముట్టుకోకు. నేను చెడిపోయాను.''

''ఏంటే, నీకు పిచ్చెక్కిందేంటి?'' అన్నాడు గదమాయిస్తూ.

''నేను చెడిపోయిన దాన్ని. కుక్క ముట్టింది. నన్ను ముట్టుకోకు!''

''ఓస్ అదా.. ఇంతకీ నేను కుక్క నంటావ్. నిన్ను చెడిపీశానంటావ్?'' అని పక పకా నవ్వాడు.

''పెద్దకాపు.. లంజకొడుకు... ఆడి తల ఒరిగిపోనూ...''
''ఏంటయింది?''
''నన్ను బలవంతాన చెడిపీశాడు. ఎత్తుకుపోయి చెడిపీశాడు. నేను చెడిపోయిన దాన్ని.'' అని మళ్ళీ బావురుమని వెక్కి వెక్కి ఏడుస్తూ చతికిలబడి కూర్చుండి పోయింది.
''పెద్దకాపా?.... అమ్మ నా కొడకా! ఎంత పనిచేశావ్... ఈరోజుతో ఆడిపని సఫా... ఒరేయ్ ఒస్తున్నా నొరేయ్..'' అని పిచ్చి కేక పెడుతూ మూలనున్న గొడ్డల్ని తీసి చీకట్లో పరుగెత్తాడు. పొలాల్లో నుంచి అడ్డం పడి పరిగెత్తుకుంటూ తాడి పెండెల్లో నుంచి రొప్పుకుంటూ రోజుకుంటూ పెద్దకాపు ఇంటి దగ్గర చేరుకున్నాడు.
సారామత్తుతోనూ, చల్లారిన కైపుతోనూ గుర్రుపెట్టి మంచం మీద నిద్రపోతున్నాడు పెద్దకాపు.
''ఒరేయ్'' మదించిన ఏనుగు ఘీంకరిస్తున్నట్లు అరుస్తూ అమాంతంగా మంచం మీది నుంచి లేవనెత్తాడు. ఆ కుదుపుకి ఒక్కసారి తెలివిలోకి వచ్చిన పెద్దకాపు కొండడి పట్టులో గిలగిల మంటున్నాడు. ఎత్తి నేలకేసి దభీమని కుదేశాడు.
''ఒరేయ్, కొండ లంజ కొడకా; నువ్వా? నీ అమ్మా'' అని లేచి కొండడి మీద కలబడ్డాడు.
''నా ఉప్పు తిని నన్నే కొడ్తావురా...? దిక్కుమాలిన నా కొడుకువి. కొండల్లో నుంచి తెచ్చి పెంచి పెద్ద చేశాను. నా మీద చెయ్యి చేసుకునేటోడు ఇంకా ఎవడూ పుట్టలేదు. నీ నెత్తురు తాగుతాను!'' అని అరుచుకుంటూ కొండడితో పెనుగులాడుతున్నాడు.
జబ్బ సత్తువుందేమో నిలదొక్కు కుంటున్నాడు. పెనుగులాటలో కొండడి చేతిలోని గొడ్డలి తుళ్ళిపోయింది. దెబ్బతిన్న అడవి సివంగిలా బలాన్ని కేంద్రీకరించుకొని పిడికిలితో పెద్దకాపు మెడమీద గొట్టాడు. తల ఒరిగిపోయింది. మరో దెబ్బ, దెబ్బమీద దెబ్బ. ఒరిగి ఒరిగి నేల మీద కూలి వెల్లకితలా పడిపోయాడు పెద్దకాపు. దూరంగా పడి వున్న గొడ్డల్ని మెరుపులా అందుకొని ఎడమ పాదంతో మెడని తొక్కిపట్టి ఒకే ఒక దెబ్బతో తలని నరకడానికి గొడ్డల్ని రెండు చేతుల్తో పైకెత్తాడు.
గొడ్డల్ని చూసి చావు కేక పెట్టాడు పెద్దకాపు.
ఆ కేకకి చీకటి గజగజ వణికింది.
చుక్కలు ఆ భీకర దృశ్యాన్ని చూడలేక బితుకు బితుకు మంటున్నాయి.
అప్రయత్నంగా కొండడి శరీరం కంపించింది. ఆ వ్యక్తమైన ఏదో వింత శక్తి ఆవహించినట్లు నరాల్లోని సత్తువ మెత్తబడి పోతోంది. కడుపులో దేవుతున్నట్టు అయింది. చేతిలో ఎత్తిన గొడ్డల్ని యాంత్రికంగా దింపేశాడు. క్రోధం తోనూ, చేతకాని రోషంతోనూ ఒగురుస్తున్నాడు. మెడ మీద పాదాన్ని ఇంకా అలానే అదిమి పట్టి గొడ్డల్ని పెద్దకాపు కంఠం ముడికి నొక్కుతూ'' బతికిపోయావు నా కొడకా. నీ తల నరికి ఆ రకతంతో చిలక మైలని కడిగేద్దామనుకున్నాను.. గాని.. గాని చెయ్యలేకపోయాను.. నీ మీద భక్తి.. ఎర్రి లంజకొండుకుని. నీ మీద నాకేల భక్తి. పరమదుర్మార్గపు నా కొడుకువి. ఆ సంగతి నాకు తెలుసు. నీ సంగతి నాకు పూరాగా తెలుసు...నేనెవడ్నో నీకూ
మంది. తగువుకు దిగింది. మా గూడెంలో అడంటే మొదట్నించి అందరికి మంటే. దురితం ఎక్కువ. కూలీ లని కొట్టి తిట్టి నానా బాధలు పెట్టేటోడు. ఈ సంగతి తెలిసిన తర్వాత కొండ

తెలుసు.. నన్నెందుకు పెంస్తున్నావో నీకూ తెలుసు. నీ ఆస్తికి కుక్కలా కాపలా పెట్టావ్. నన్ను కొట్టావ్. కుళ్ళబొడిచావ్... గాని నిన్ను చంపలేకపోయాను. ...ఛీ, బానిస బతుకు. సవట లంజికొడుకుని!'' అని రుద్ధకంఠంతో తన్ని తానే తిట్టుకొంటూ పట్టు వదలి క్షణం సేపు పెద్దకాపు కళ్ళల్లోకి తీక్షణం గా చూసి గొడ్డలితో తిరిగి గుడిసె ముఖం పట్టాడు.

పెద్దకాపు నోట్లో నుంచి కారుతున్న నెత్తుర్ని మోచేత్తో తుడుచుకున్నాడు. ఆఖరిసారి కొండడు చూసిన చూపులు ఈటెల్లా పెద్దకాపు గుండెల్లో నుంచి దిగి కడుపులో పేగుల్ని దేవేస్తున్నాయి.

★ ★ ★

కొండడు సిగ్గుతోనూ, అవమానంతోనూ, చేతకానితనంతోనూ కృంగిపోయి తలదించుకుని గుడిసెలోకి అడుగుపెట్టాడు.

అవయవాలు పట్టు తప్పినట్లు వేలాడుతున్నాయి. చేతిలో గొడ్డలి జారిపడింది. చిలక ముఖంలోకి చూడలేకపోతున్నాడు. కొండడి భుజంమీద చిలక చెయ్యి వేసింది.

''ఎందుకు వణికి పోతున్నావ్? ఆడ్ని నరికేశావా? నువ్వూ మొగోడివి. పద, ఆడి తలని పట్టు కొని ఎటైనా పారిపోదాం. లేకపోతే ఈ సరస్సులో బురదలో కప్పెట్టేద్దాం'' అంది అప్రయత్నంగా తనూ వణుకుతూ.

''ఆడ్ని చంపలేదు... చంపుదామని గొడ్డలి ఎత్తాను. చేతులు రాలేదు.''

''ఏమీ అలాగంటావేటి.. అవును నేను నీ పెళ్ళాన్ని అవుతేకదా!!!''

మధ్యలో మాటలు తుంచేస్తూ ''చిలకా; పద, మనం ఇక్కడ నుంచి పోదాం. ఇక్కడుండలేం. ఎక్కడికైనా పోదాం. మన బ్రతుకు మనం బ్రతగ్గలం.''

''ఎక్కడికి. ఎందుకు?'' కొండడు ఎందుకు మాట మార్చాడో అర్థం కాక అంది చిలక.

''అదిగో ఆ కొండలలోకి. నాకు జబ్బసత్తువుంది. వేట చెయ్యగలను. మనం అవీ ఇవీ పండించు కొని బ్రతగ్గలం. ఆ కొండల్లో మనలాంటి వాళ్ళు సాలా మంది ఉంటారు. ఆళ్ళలో కలసిపోదాం. ఇక్కడ మనం మసల్లేం. మనకి ఆసరా లేదు'' అన్నాడు ఉద్వేగంతో.

''ఏటి, ఇసిత్రంగా ఉన్నాయి నీ మాటలు. ఆడిని సంపలేక పోయానంటున్నావ్. ఇక్కడ నుంచి పారిపోదాం అంటున్నావ్. ఇదిగో మాటలుమార్చక. ఆడు నన్ను చెడిపేశాడు. ఆడిని నేను ఒగ్గను. నీకు సేతకాకపోతే ఆ గొడ్డలిలాతే నేనే దారికాసి ఏటేసేస్తాను'' అంది కసితో.

కొండడు చిన్న పిల్లవాడిలా ఏడుపు మొదలెట్టాడు.'' చేతగాని లంజికొడుకుని... సవటని... నీ పగ తీర్చుకోలేకపోయాను....'' అని బెక్కుతున్నాడు.

''ఆడంటే నీకంత బులపాటం దేనికి? నీతోటోడా, నీ ఊరోడా, నీ సుట్టపోడా.. లేక నీ బాబా?'' కొండడికి చివరిమాట చెళ్ళుమంది. ''అవును'' అన్నాడు శూన్యం లోకి చూస్తూ.

''అంటే?'' గతుక్కుమంది చిలక

''ఆడికి నేను పుట్టాను. పెద్ద కాపు నా తండ్రి.'' చీకట్లో ఆకాశం మీద పరుచుకొన్న చుక్కల్ని చూస్తూ చెప్పాడు-'' మొగుడు చచ్చిపోయిన తర్వాత ఈడు అడవిలో పనులు చేయిస్తున్నప్పుడు మా అమ్మను చేరదీశాడు. దానికి ఆశలు చూపించాడు. మాయమ్మ ఆడికి లొంగిపోయింది. దొంగచాటుగా నన్ను కన్నది. నేను భూమ్మీద పడగానే కన్ను మూసింది. మా అమ్మమ్మ ముసిల్ది గొల్లుమంది.

గూడెం ఓళ్ళు ఆడ్ని ఇంట్లో పెట్టి నిప్పెట్టేస్తామన్నారు. కులం తప్పు కట్టమన్నారు. ఇంత మోజూరోడూ అందరూ తిరగ బడగానే హడిలిపోయాడు. చంపేస్తారని భయం పట్టుకుంది. నన్ను కన్నందుకు పెంచి పెద్ద జేస్తానని ఒప్పుకున్నాడు......''

''రాను రాను ఆడికి అక్కడుండం మరీ కష్టమైపోయింది. అందుకే ఆ పనులు ఒగ్గేసి నన్ను ఈ ముసిల్దాన్ని ఇక్కడకు తీసుకొచ్చాడు. నన్ను కూడా ఒగ్గేసుండునేమోగాని ముసిలిది మాత్రం ఆడు పారిపోకుండా ఎప్పుడూ కనిపెడుతూనే వుండేది. ఇక్కడకు వచ్చిం తర్వాత కూడా ముసిల్ది ఆడితో చాలాసార్లు జట్టీకి దిగింది. నా పేర ఆస్తి రాయమంది లేకపోతే ఇక్కడ ఊరంతా ఆడిరంకు బయట పెట్టేస్తానన్నది. దాని నోటికి జడిసీటోడు. మమ్మల్ని ఇక్కడ ఉంచాడు. డబ్బు కూడా ఇస్తుండేవాడు. ఇదిగో అదిగో అంటూ ఆస్తి రాయటం అట్టాగే జాగుచేశాడు . ఒకసారి నాను సూస్తుండగనే గుడిసెలో ఆడి గొంతుకు పట్టుకుని పులి పిల్లలా ఏలాడబడింది. రాస్తావా సంపేసేదా అంది. ''

''నా రోజులు బాగోలేవు. ముసిల్దానికి ఉన్నట్టుండి జబ్బు చేసి రోజు తిరక్కుండానే చచ్చి పోయింది. సచ్చి పోయేముందు ఈ సంగతి అంతా నాకు సెప్పింది– నువ్వే ఆడి కొడుకువి. నువ్వే ఆడికి పుట్టావు. ఆ ఊర్లో సదువుకుంటున్నోడు పెంపుడోడు. ఎవడికి పుట్టాడో.... ఆడికి ఆస్తి బదలాయించాలని చూస్తున్నాడు. దాన్ని నువ్వు ఒగ్గకు.. జాగరత్తగా ఉండు సుమీ. నిన్నుసంపిం చీసినా సంపించేస్తాడు– అని మరీ ఎచ్చరించి సచ్చిపోయింది. ఇప్పుడా కత ఎవరు నమ్ముతారు. నాకిక్కడ ఆసరాలేదు. నాకు ఎవ్వరూ లేరు. నువ్వు తప్ప. పద మనం గూడానికిపోదాం.'' అన్నాడు కొండడు దీనంగా.

చిలక అంతా నిశ్శబ్దంగా వింది. నిశ్చలంగా గంభీరంగా సరస్సు మీదికి చూస్తోంది.

''కొండా! అయితే ఆడి రకతం నీ రకతం ఒకటేనన్నమాట!'' అంది అనుమానంగా ఏదో ఆలోచిస్తున్నట్లు.

బెస్తపల్లెలో కోళ్ళు కూస్తున్నాయి. తెల్లవారుజాము కావస్తున్నా ఇంకా చీకటి గానే ఉంది.

''ఆడి కంతిరీ రకతం నీలోనూ పారుతోంది. అందుకే సంపలేక పోయావ్.''

కొండడు తల వంచుకొని సిగ్గుతో బొటనవేలు రాస్తున్నాడు.

''ఆ గొడ్డలి ఇలా ఇయ్యి'' గద్దించింది

''ఒలె, నీకుగాని మతిపోయిందేటే, ఖూనీ కేసు అయిపోగలదు. ఉరిసిచ్చ పడిపోతాది.''

''నీకు కాదుగదా! ఓశ్ ,తండ్రి ప్రేమ ఎంత తన్నుకొచ్చిందో!'' అంది ఎగతాళిగా.

''చిలకా, నీపు పుణ్యముంటాదే. నన్ను కుళ్ళ బొడిసీకే. సేతగాక సిగ్గుతో సగం సచ్చినాను. ఎందుకే గెద్దలా అలా పొడుచుకు తింటావ్. పోనీ ఆ గొడ్డలితో ఒక్కపాలి నన్ను నరికెయ్యే.''

కొండడి బిరుసు తేరిన జుత్తులోకి వేళ్ళు పెట్టి తల నిమిరింది నవ్వుతూ. నాలుగు తన్ని నిస్స హాయంగా నిల్చున్న చంటిపిల్లాడిని ముద్దు చేస్తున్న తల్లిలా.

''చిలకా, రేపు చీకటి పడ్డాక ఒచ్చెయ్, పడవలో పారిపోదాం.''

వయిపు వెళ్తున్నాయి.

''ఒస్తాను. నీతోనే ఒస్తాను. తీసి కెళ్లవుగాని, గాని రేపు నా కోసం సూడకు. వీలుచూసుకుని నేనే కబురంపుతా. నన్ను లేవదీసుకుని కొండల్లోకి పోదువుగాని. నీ బాబులాగ నన్ను ఒగ్గీవు కదా?'' అందినవ్వుతూ. ''వస్తానూ'' అని కొంత దూరం నడిచి రివ్వున పరుగెత్తుకొని వెనక్కి వచ్చి ''కొండా; అవునుగాని, నాకు బిడ్డ పుడితే ఆడు నీ కొడుకా, మరి నీ తమ్ముడా?''

''నీగ్గాని శకాలం ఎత్తిందేటే'' అన్నాడు కోపంగా.

అగ్నిపర్వతం పేలి నిప్పురవ్వలు చిట్లుతున్నట్లు పగలబడి కిసుకిసుమని నవ్వుతూ పరుగెత్తింది. అవి క్రోధం, అనుమానం, అవమానంతో కలిసిన అర్థంకాని వెర్రి నవ్వుల్లా ఉన్నాయి.

''నీ కోసం చూస్తుంటానూ'' అన్నాడు కొండడు మసగ చీకట్లో పరుగెత్తుతున్న చిలక్కి చెయ్యూపుతూ.

నవ్వులు దూరమౌతున్నాయి. చుక్కమ్మ జాతరలోని డప్పుల వాయిద్యాలు తారాస్థాయి నందుకొంటూ స్పష్టా స్పష్టంగా వినిపిస్తున్నాయి.

## 9

రాత్రంతా కొండడికి నిద్రపట్టలేదు. ఏవేవో ఆలోచనలు మనస్సుని కెలుకుతున్నాయి.

గుడిసె బయటికి వచ్చి నిల్చున్నాడు. పొగమంచు దట్టంగా మేఘంలా సరస్సునీ పరిసర ప్రాంతాలనీ కమ్మేసింది. గుడిసె చూరుల్లో నుంచి మంచు బొట్లు టప్ టప్‌మని పడుతున్నాయి. కన్ను పొడుచుకుని చూచినా ఎదుటివస్తువు కన్పించటం లేదు. అంతా తెల్లటి మంచుమయం. సన్నని ఇసకలా మంచు చినుకులు శరీరాన్ని సూదుల్లా గుచ్చుతున్నాయి. చెట్లమీది నుంచి ఎండుటాకుల మీదన పడుతున్న మంచు బొట్ల చప్పుడులు ఆ నిశ్శబ్దంలో స్పష్టంగా వినిపిస్తున్నాయి.

నిరాశ, నిస్పృహ, కసితో కుమిలి పోతున్న కొండడికి ప్రకృతి కూడా తన మీద కత్తి కట్టినట్లు కనిపించసాగింది. ఆ క్షణం తెల్లటి మంచు దెయ్యాలు ఆప్యాయంగా గొంతు నులిమివేసి, నిశ్శబ్దాల లోయల్లోకి తోసేస్తున్నట్లు, ఎన్నడూ లేని భయంతో కంపించిపోతున్నాడు. తను పెరిగిన ఈ వాతా వరణం, సరస్సు, చెట్లు చేమలు మనస్సులో వికృత రూపం దాల్చి తనమీద కసితో విరుచుకు పడు తున్నట్లు భావించాడు.

పిచ్చెత్తిన ఏనుగుకి కలిగిన విధ్వంసక ఆలోచనల్లాంటి ఆలోచనలు బుర్రను దొలిచేస్తున్నాయి. పడవతీశాడు. ఎందుకో ఎక్కడికో తెలీదు. కసిగా గెడ తొక్కుతున్నాడు. సరస్సు మీద కమ్మిన మంచు మేఘంలో నుంచి పడవ పరుగులు తీస్తోంది. దారి కనిపించడం లేదు. పిచ్చిగా గడ్డిని, గుబుర్లని తోసు కుంటూ తూగుతూ పరుగెత్తుతోంది. మంచుకి తడిసిన రెక్కల్ని విదిలించుకుంటూ డేగ ఒక మూల నక్కి కూర్చుంది.

పల్లెలో కోళ్ళు కూస్తున్నాయి. లేగ దూడలు అరుస్తున్నాయి. కొండవాలున తాటిచెట్ల శిఖరాలు మెల్ల మెల్లగా మంచు ముసుగులో నుంచి మసగ్గా కనిపిస్తున్నాయి. సరస్సు మీద మంచు రాను రాను పల్చబడుతోంది. నీటి పిట్టలు పిచ్చిగా అరుస్తున్నాయి. తూర్పున వెలుగు చూస్తుండగానే చిక్క బడుతోంది. ఆకాశం రంగులు మారుస్తోంది. మంచు కరిగి తెరలు తెరలుగా విడిపోతోంది. నీటి బాతులు కరుగుతున్న పొగమంచులో నుంచి గుంపులు గుంపులుగా ఎగురుతూ కొండ మలుపు

వెలుగులో మెల్లిగా అక్కడక్కడా నాచుగుబుర్లు, చేపల వేటకి బయలుదేరిన పడవలు, నీటిమీద ఒక్కొక్కటి సాక్షాత్కరిస్తున్నాయి. కొండడి పడవ సరస్సు మీద నల్లటి చుక్కలా కనిపిస్తోంది. ఉషోదయపు కాంతి కిరణాలు నులివెచ్చగా విడుతున్న మంచు పగుళ్ళలో నుంచి సరస్సు మీద పసిడి రంగుల్ని విరజిమ్ముతున్నాయి.

బాగా ఎండెక్కింది. కొండడి పడవ పరుగెత్తుతూనే ఉంది.

మధ్యాహ్నం అయింది. కొండడి పడవ ఇంకా పరుగులు తీస్తూనే ఉంది. గమ్యం లేదు. అడ్డు తగిలిన తీగల్ని, గడ్డినీ, దుబ్బుల్నీ గొడ్డలితో నరుకుతున్నాడు. వల వేసిన బుట్టల్ని, మావుల్నీ చీల్చుతున్నాడు. తనకే అర్థంకాని అయోమయ పరిస్థితిలో వెర్రిపీరులా పడవని పరిగెత్తిస్తున్నాడు. నడినెత్తిని సూర్యుడు చురచుర మంటున్నా వేళ తెలియడం లేదు. ఆకలిదప్పులు లేవు . ఒకటే పరుగు. పడవలో నెత్తురు, ఒళ్ళంతా నెత్తురు . తలపైకెత్తి చూశాడు. డేగ గాలిలోనే కొంగని ఢీకొంది- రక్తం. పడవలోకి తెచ్చి గోళ్ళతో గుండెల్ని చీల్చి ముక్కుతో కంఠాన్ని పీకుతోంది. పెద్ద కాపు కంఠం ముడి కొండడికి జ్ఞాపకం వచ్చింది. ''సంపేయ్, నీ ఇష్టమొచ్చినట్లు సంపెయ్. ఇక్కడున్న పిట్టల్ని, పురుగుల్ని, మనుషుల్ని అందరినీ సంపేయ్. రేపు సిలకతో కలిసి దూరంగా పోదాం'' అని గాలిలో డేగని హెచ్చరిస్తూ అరిచాడు.

ఉద్రేకంతో, పూర్తి జబ్బసత్తువుతో వేసిన గెడలకి పడవ నీటిమీద ఎగురుతూ పరుగెత్తుతోంది. గెంతుతోంది, ఒరిగిపోతోంది. డేగ రక్తపిశాచంలా ఎగిరే పిట్టల్ని దెబ్బమీద దెబ్బ తీస్తోంది. తేలే చేపల్ని మెరుపు వేగంతో తన్నుకు పోతోంది. పడవలో విందారగించుతోంది. కొండడి భుజం మీదవాలుతోంది. కొండడూ, డేగా ఇద్దరూ రొప్పుతున్నారు. ఒకటి చేతకాని ఆవేశం. మరొకటి విజయావేశం. మధ్యాహ్నం దాటిపోయింది. కొండడు పడవ మళ్ళించి సముద్రం మొగవైపు నడిపిస్తున్నాడు.

అంతవరకూ చుర చుర లాడుతున్న ఎండ హఠాత్తుగా చల్లబడింది. ఆకాశం నలువైపులా గుడ గుడమని ఉరుములు. తేమ గాలుల మీద ఊగుతూ నల్లటి నీటి మేఘాలు పరుచుకుంటూ పెనవేసుకుంటున్నాయి. ఉన్నట్లుండి ఒక్కసారి ఆకాశం అంతా మేఘావృతమైంది.

మబ్బు పట్టిన ఆకాశం ప్రతిఫలిస్తున్న సరస్సు మసకబారి దీనంగా వుంది. తెల్లటి కొంగలు నీటి మబ్బుల్లోంచి గుంపులు గుంపులుగా ఎగురుకుంటూ, అరుచుకుంటూ పోతున్నాయి. నీటి కాకులు, తురాయి పిట్టలు సరస్సు మీది నుంచి లేచి సరుగుడు చెట్లమీద కూర్చుంటున్నాయి. వర్షాగమనం పసిగట్టిన నీటి పిట్టల అలికిడి తగ్గింది. చల్లగాలి రివ్వున వీస్తోంది. కొండడి పడవ సముద్రం మొగవైపు ఎదురుగా వెళ్తోంది. పడవ వేగం మందగించింది. గెడ భారంగా పడుతోంది. తిరిగి పోవడం ఇష్టం లేక పిచ్చి పంతంతో పడవని ఎదురునడుపుతూ సముద్రం మొగ చేరుకున్నాడు. చీకట్లు ముసురు కుంటున్నాయి. మేఘావృతమైన ఆకాశం క్రింద, చీకటి, కరిగించిన తారులా పేరుకు పోతోంది.

కొండడు సముద్రం మొగ దగ్గర పడవని నిలిపాడు. తన జబ్బ సత్తువునూ, విజయాన్ని, పంతాన్ని అభినందించుకున్నాడు. మనస్సు కాస్త ఊరట పడింది. ఈ లోకంలో పడ్డాడు. రేపు చిలక

వచ్చేస్తాది. బేగ ఇంటికి చేరాలి అనుకున్నాడు. ఒకటి రెండు చినుకులు పడ్డాయి.

మెరుపు మెరిసింది. పొంగుతున్న సముద్రం తళుక్కుమంది.

దూరాన పిడుగు పడింది- కొండల్లో శతఘ్నులు మ్రోగినట్లు.

కొండడు పడవ తిప్పి ఇంటి ముఖం పట్టాడు. సరుగుడు తోటల్లో దూరంగా ఎండుటాకుల మీద పడుతున్న వర్షపు చినుకుల శబ్దం రాను రాను దగ్గరౌతూ, గాలి ఊళలతోనూ, సముద్రపు హోరుతోనూ కలిసి విసురుగా తెరలా టపటపమని రివ్వున ఒక్క బిగిని నలువైపులా కమ్ముకుంటూ సరస్సు మీది నుంచి దూసుకు పోయింది. వర్షం తెరలు తెరలుగా కొడ్తోంది. కొండడు తడిసి ముద్దయి పోయాడు. చీకట్లో సముద్రం శివమెత్తినట్లు ఇసుక మేటల్ని కోసుకుంటూ సరస్సులోకి కట్టలు తెంచుకొని దూసు కొచ్చింది. ఆ ఊపుకీ కొండడి పడవ ఉవ్వెత్తుగా లేచి బోల్తా పడింది. డేగ తప్పించుకొని చీకట్లో రెక్కలు కొట్టుకొంటూ క్రీచ్ క్రీచ్‌మని అరుస్తూ దిక్కుతోచక ఎగురుతోంది. కొండడు నీటిలో మునకలేస్తూ కొట్టుకు పోతున్న పడవనీ, గెడనీ, చీకట్లో దేవి దేవి పట్టుకున్నాడు. ఉప్పునీరు కళ్ళల్లోకి నోటిలోకి పోయి వికావికలైపోతున్నాడు. బలాన్నంతా కూడ గట్టుకొని మును గుతూ తేలుతూ పడవని తిరగేసి నిలబెట్టి ఎక్కికూర్చున్నాడు. డేగ కొండడి వీపు మీద వాలి రెక్కలు కొట్టుకుంటూ చీకట్లో తమాయించుకొంటోంది.

ఉరుములు, మేఘాలలో నుంచి కొండ చిలువలు పలవల నాలికల్ని సరస్సు మీదికి చాస్తున్నట్లు మెరుపుచీలికలు చీకట్లను చీల్చుకుంటూ, గుండెలు అవిసిపోయే పిడుగుల ఫెళఫెళలతో వాతావరణం అంతా ప్రళయ సదృశంగా వుంది.

గెడ వెయ్యకుండానే పడవ పరుగెత్తు తోంది.

చుక్కమ్మ జాతర ఫలితమా అన్నట్లు కుంభవృష్టి.

చీకట్లో పడవని అదుపు చేసుకుంటూ చచ్చీ చెడి గుడిసె చేరుకున్నాడు. పడవని కట్టి కొక్కెంలో అమర్చిన గొడ్డలి తీసుకొని, డేగని తీసుకొని గుడిసెలో ప్రవేశించాడు.

అంతకు ముందున్న ఆవేశం. కోపం ప్రకృతితో పడిన ఘర్షణలో చాలామటుకు ఉపశమించింది.

''తెల్లారగనే విముక్తుడ్ని అవుతాను'' అనుకొంటూ పడుకున్నాడు. చిలక రాక కోసం కలలు గంటూ బయట హోరు గాలి జోలపాటతో నిద్రపోయాడు.

వేలాడుతున్న వెదురు బద్ద మీద నిల్చున్న డేగ గాలికి ఊగుతూ మెరుపు మెరిసినప్పుడల్లా కిటికీ లోనుంచి చీకట్లోకి నిక్కి నిక్కి చూస్తోంది.

## 10

రాత్రంతా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం ఉదయానికి తగ్గిపోయింది. ఆకాశం నిర్మలంగా కడిగినట్టుంది. బాగా పొద్దెక్కింది. ఎండ తీక్షణతని సంతరించుకొంటోంది. ఆదమరచి నిద్రపోయిన కొండడు లేచేసరికి బారెడు పొద్దెక్కింది. కళ్ళు నులుముకుంటూ గుడిసె బయటకి వచ్చి వళ్ళు విరుచుకుంటూ సరస్సు మీదికి కలియచూశాడు. సరస్సు వర్షానికి నిండి పోయింది. నీరు బురద రంగులో ఉంది. అక్కడక్కడ మునిగిపోయిన గడ్డి, రెల్లు గుబుర్లు, పొదలు, కాడలు మాత్రం నీటి మీద తలలూపుతున్నాయి. పడవలు తిరగటం లేదు.

దూరంగా ఒడ్డున జనం గోల వినిపిస్తోంది.

నిద్రకళ్లల్లోకి పడుతున్న ఎండకి చెయ్యి అడ్డం పెట్టుకొని ఒడ్డువైపు చూశాడు. జనం గుమిగూడి ఉన్నారు. అటుఇటు పరుగెత్తుతున్నారు. అందరి చూపులు సరస్సు మీదే ఉన్నాయి. కొండడుకూడా పరుగెత్తుకుంటూ వెళ్ళాడు. కొండడ్ని చూడగానే జనంలో సంచలనం. పెద్దకాపు కూడా ఉన్నాడు.

''చిలక చచ్చిపోయింది.''

''నీటిలో మునిగి బలవంతాన పేణం తీసేసుకుంది.'' ఎవరో అన్నారు.

''చేపల వేటకి ఎల్లేతలికి శవం తేలుతోంది. గచ్చుయిపోయి పడవ తిప్పి పారొచ్చేసినాను''

.....

కొండడు మాట్లాడలేదు. చైతన్యం కోల్పోతున్నట్లు కళ్ళు గాజు కళ్ళులా శూన్యంలోకి చూస్తున్నాయి. నిర్జీవ శిలా ప్రతిమలా ఉండిపోయాడు.

చిలక మారటి తల్లి గొల్లుమంటోంది.

పెద్దకాపు ముఖం తిప్పి నిల్చొనున్నాడు.

కొండడు మంచుగడ్డలా ఘనీభవించుకు పోతున్న హృదయం బరువెక్కుతోంది. ఊపిరి పీలుస్తున్న శవంలా వున్నాడు.

శవాన్ని తీసుకొద్దాం పదండి. ఎండ జోరుగా ఉంది. ఇప్పటికే వాసన కొట్టేస్తుంటాది.

''ఆగండి!'' కొండడి గావుకేక. శవం దయ్యంగా మారినట్లు అందరినీ తీక్షణంగా వికృతంగా చూస్తూ ఒక్కొక్క అడుగు ముందుకు వేస్తున్నాడు. అందరూ క్షణం సేపు నివ్వెరపోయారు. తర్వాత భయం భయంగా పక్కకి తప్పుకున్నారు. అలా నడుస్తూ వెళ్ళిన కొండడు పెద్దకాపు దగ్గర ఆగాడు. పెద్దకాపు లేని ధైర్యం తెచ్చుకొని బిగుసుకుపోతూ కొండడి కళ్ళల్లోకి సూటిగా చూడలేక చూడలేక చూస్తున్నట్లు నటిస్తున్నాడు. కొండడి గుండెలు ఎగిరి పడుతున్నాయి. ఎవరూ మాట్లాడడం లేదు. అంతా నిశ్శబ్దం. అలా చూస్తున్న కొండడు హఠాత్తుగా తిరిగి గుడిసె వైపు పరుగెత్తాడు. అందరూ అర్థంకాక కొండడు పరుగెత్తినవైపు చూస్తున్నారు. గుడిసె లోకి వెళ్ళిన కొండడు మరుక్షణంలో గొడ్డలితో తిరిగి వచ్చాడు. ఒడ్డున కట్టిన పడవని విప్పాడు గెడేసుకుంటూ సూటిగా వచ్చి జనం దగ్గర ఒడ్డున ఆగాడు. పడవ లో నుంచి గెంతి మోకాలు లోతు బురదలోనుంచి కసబిస నడుచుకుంటూ ఒడ్డెక్కి జనాన్ని తోసుకుంటూ పెద్దకాపు దగ్గర ఆగాడు. చేతిలో గొడ్డలి బిగుసుకుపోతోంది.

జనం ముందుకు రాబోతున్నారు.

''ఆగండి ! ముందుకు రాకండి! నా మానాన్న నేను పోతాను. నాతో కూడా చిలక శవాన్ని తీసుకు పోతాను....'' అని చెప్పి వెనక్కి తిరిగి చేత్తో పెద్దకాపు ముఖం పట్టుకొని ఎత్తాడు.

''నేను ఎల్తున్నాను. బతికిపోయానని అనుకోకు. తిరిగొస్తాను. అప్పుడునీశవంతో తిరిగెల్తాను!'' అని ఒక నెట్టు నెట్టాడు, పెద్దకాపు వెల్లకితల పడబోతూ తమాయించుకున్నాడు.

కొండడు వచ్చినంత ఊపుతోనే తిరిగి వెనక్కి వెళ్ళి పడవని తోసుకొంటూ ఎగిరి కూర్చొని గెడేస్తున్నాడు.

చిలక చావుకి, పెద్దకాపుకి, కొండడి ప్రవర్తనకి సంబంధం ఏమిటో ఎవ్వరికి అర్థంకాక అయో

మయ పరిస్థితిలో చూస్తున్నారు. జనం చూస్తుండగనే పడవ దూరమౌతోంది. పడవని అనుసరిస్తూ కొండడి డేగ కూడా ఎగురుతూ వెళ్ళటం జనం దూరం నుంచి చూస్తున్నారు.

## 11

ఆవలి ఒడ్డున దగ్గరౌతున్న పడవని గమనించిన రాబందులు రెక్కలు కొట్టుకొంటూ లేచాయి.

శవం బోర్లా నీటిమీద తేలుతోంది. వీపు పైభాగం మాత్రం బయటకి కనిపిస్తోంది.

ఈగలు జుమ్మున లేస్తున్నాయి.

రాబందు గెంతుకుంటూ పరుగున వచ్చి రెక్కల బారచాచుకుంటూ నిక్కి నిక్కి చూస్తోంది.

గాలి వీచినప్పుడల్లా శవం గబ్బుకంపు.

పడవ ఆగింది. కదులుతున్న నీటిలో శవం ఊగుతోంది. అలా చిలక శవాన్ని చూస్తూనే చాలాసేపు పడవలో నిల్చున్నాడు. సరస్సంతా పిచ్చిగా కలియచూశాడు. దుఃఖం గుండెల్లోనే ఇంకిపోయింది.

శవాన్ని ఎత్తి భుజానికెత్తుకుని పడవలో పడుకోబెట్టాడు. ముక్కుని, చెవుల కొనల్ని చేపలు కొరికేసున్నాయి. శవం నోట్లో నుంచి, ముక్కులో నుంచి నీళ్ళు బొళబొళ కారుతున్నాయి. చెట్ల మీద రాబందు లు సకిలిస్తున్నట్లు అరుస్తున్నాయి.

డేగ యజమానిని గమనిస్తూ శవం వాసనకి సన్నగా అరుస్తూ తలమీద వలయాకారంగా తిరుగుతోంది.

పడవ బయలుదేరింది. ప్రక్కన శవం. పడవని అనుసరిస్తున్న డేగ. కొండల వైపు వెళ్తున్నారు. ఒడ్డున వున్న జనం అలా చుక్కలా నీరెండలో దూరమౌతున్న పడవని చూస్తున్నారు.

కొండల మలుపులో పడవనివదిలేసి శవాన్ని భుజానికెత్తుకొనికొండడు రాళ్ళని దాటుకొంటూ తుప్ప అడవిలో అడుగు పెట్టాడు. పడవ గాలివాటుకి ఎటో పోతోంది.

శవం భుజం మీద వేలాడుతున్నది.

భుజం మీద వాలబోతున్న డేగని చేత్తో విదిలిస్తున్నాడు.

చుట్టూ కొండలు, సాయంకాలం నీడలు విస్తరించుకుంటున్నాయి.

శవాన్ని దింపి మొలలో గొడ్డల్ని తీసి కర్రలు కొట్టాడు. ఎండుపుల్లల్ని చితిగా పేర్చాడు. కర్రల్ని అమర్చాడు. శవాన్ని ఎత్తి చితిమీద బోర్లా పడుకోబెట్టాడు. చెదిరిపోయిన చీరని గట్టిగా చుట్ట చుట్టాడు.

లోయలో నీడలు చిక్కబడుతూ చీకటి లోకి జారుకుంటున్నాయి.

సరస్సు మీద అలుముకుంటున్న సంజె చీకట్లో అస్తమిస్తున్న సూర్యుడి అరుణకాంతి పుంజాలు చిక్కుకొని, క్షణం సేపు చీకట్లో రక్తం పండినట్లు, నీటి అడుగు నుండి మంటలు లేస్తూన్నట్లు, చీకటి పొదలు అగ్ని పూలు పూస్తున్నట్లు, ప్రకృతి భీకరాకృతిని దాల్చింది. సూర్యుడు దిగిపోయాడు . అంతా తిరిగి చీకటి.

చితిచిటపటలాడుతూ రాజు కొంటోంది. పొగలోనుంచి నిప్పు రవ్వలు ఉవ్వెత్తుగా లేస్తున్నాయి.

శవం కాలుతున్న కంపు గాలిలో తేలుతోంది.

కొండడు నిశ్శబ్దంగా పుల్లల్ని ఎగదోస్తున్నాడు– శవాన్ని తిప్పుతున్నాడు. కొవ్వు కాలుతూ

మంటలు ఉండుండి భగ్గున లేస్తున్నాయి. ఆ మంటల వెలుగులు, పొగల అంచున ఎగురుతున్న డేగ రెక్కల మీద పడి తళుక్కున మెరుస్తున్నాయ్.

శవం వాసన పసిగట్టిన దుమ్ముల గొండు పొదల్లోంచి వికృతంగా అరిచింద.

కొండడు దూరంగా కూర్చుని మంటలలోకి చూస్తున్నాడు. చిలక నవ్వు తెరలు మనస్సులో కదులుతున్నాయి. చుట్టూ కొండలు. ఎటుచూసినా శూన్యం. ఒంటరి వాడు.. ఒక్కసారి బావురు మన్నాడు. కొండలు కూడా గొంతుక చించుకుని ఏడుస్తున్నట్లు ప్రతిధ్వనించాయి.

''క్లిర్ ! క్లిర్!'' రుద్ధ కంఠంతో డేగకి ఈల వేశాడు.

డేగ భుజం మీద వాలి మారాం చేస్తోంది. దాన్ని ఆప్యాయంగా చేతిలోకి తీసుకున్నాడు. రెక్కల్ని ముద్దాడాడు–''పో! ఎలిపోయే! ఒగ్గేస్తున్నాను. ఇన్నాల్లు నువ్వు నాకు,నేను మరొకడికి– బానిసలుగా బతికాం. నీ ఇష్టం వచ్చినట్లు తిరుగు!'' అని దాని కాలి ఇనప కొక్కెం తీసి గాలిలోకి ఎగరేసి దాన్ని వదిలేశాడు. చీకట్లో మంట వెలుగులో అక్కడక్కడే తిరుగుతోంది కాని పారిపోలేదు. ''నీయమ్మా నీకూ బానిస బతుకు అలవాటైపోయిందే. పొమ్మంటే పోవేమే?'' అని కసిగా రాళ్ళు తీసి దాని మీదికి పిచ్చిగా రువ్వుతున్నాడు. రాళ్ళని తప్పించుకుంటూ డేగ కనుమరుగైంది.

కొండడు కొండల వైపు బరువుగా అడుగులేసుకుంటూ నడుస్తున్నాడు. కాలు ముందుకు పడడం లేదు. ఒక్కసారి వెనక్కి తిరిగి ఆఖరి సారిగా చిలక చితివైపు చూశాడు. మంటలు లేని చితి పిల్లగాలికి నిప్పులతో కణ కణలాడుతోంది. దూరం నుంచి కొడిగట్టిన సంధ్య దీప శిఖలా ఉంది.

బోర్లా సాష్టాంగ పడి చితికి దణ్ణం పెట్టాడు. లేచి నిల్చొని చేతిలో గొడ్డల్ని గాలిలోకి ఎత్తిపెట్టి ''నేను తిరిగొస్తాను. నీ పగ సాధిస్తాను !''అని చితిమీద ప్రమాణం చేశాడు. గొడ్డలితో తుప్పల్ని, డొంకల్ని కసి తీరా నరుక్కుంటూ పరశురాముడిలా కొండల్లోకి వెళ్ళిపోతున్నాడు.

రెక్కలు కొట్టుకుంటూ మెత్తగా కొండడి భుజానికి రాసుకుంటూ డేగ చీకట్లో గుడిసె వైపు ఎగిరిపోతోంది.

అది గమనించని కొండడు కొండల వైపు నడుస్తున్నాడు.

## 12

కొండడి గుడిసెలో ఆ రాత్రంతా పెద్దకాపు తన అనుచరులు తప్పతాగి తూలుతున్నారు.

''ఒరేయ్, గంగా! ఆ కొండ నాకొడుకు తిరిగొస్తాడట!'' వికృతంగా ముఖం పెట్టి మింగుడు పడని సారా గుక్కని బలవంతంగా గుటకేస్తూ అన్నాడు పెద్దకాపు.

''రానీ, నా కొడుకుని! సరస్సుకి బలేసేస్తాను. నా జబ్బ సత్తువ నీకు తెలీంది కాదు''. అన్నాడు గంగడు సీసాని గాల్లోకి ఎత్తుతూ.

''ఏ కంతిరీ లంజీ కొడుక్కి పుట్టాడో ; అన్నీ గాతకపు బుద్ధులే !''అన్నాడు మరొకడు.

పెద్దకాపుకి నిషా వదిలినట్లు ఆ మాటలు చెళ్ళున తగిలాయి.

''ఆడి మాట ఒగ్గేయండేహెయ్. ఆడి సంగతి మరిచిపోండి. మనం కుషీచేసుకుందాం. ఇష్టం వచ్చినట్లు తాగండి. ఫుల్ ఫోర్స్ ఎక్కిపోవాలి !'' అన్నాడు గంగడు.

''ఆడు ఈ రాత్రే తిరిగి రాడు కదా?'' అన్నాడు గొణుక్కొంటూ పెద్దకాపు.

''ఆడు సచ్చినా ఆ కొండలోనుంచి ఈ రాత్రి రాలేడు. రేప్పొద్దుటే ఆడిని ఏట కుక్కలాగ కొండ కొండా గాలించేసి, నీ పాదాల కాడ కట్టి పడేసి; తరువాత చిలకని ఖూనీ చేశాడని కేసు బనాయింపించి బొక్కలో తొయ్యింయెయ్యనూ?'' అన్నాడు గంగడు.

అందరూ గంగడి ప్లానుకు తెగమెచ్చుకుంటూ వాడిని అభినందిస్తూ ఎడతెరిపి లేకుండా తాగుతున్నారు.

ఆ రాత్రంతా ఒకటే తాగుడు . తిట్లు , బూతులు; వాంతులు, మూల్గులు! మత్తులో నిద్రలో పడిపోయారు.

తెల్లవారింది. సరస్సు మీద పిట్టలు అరుస్తున్నాయి.

ఎండ పొడ కిటికీలోంచి గుడిసెలోకి పడుతోంది. ఒక్కొక్కరూ మెల్లగా లేచి బద్ధకంగా వికారంగా ఒళ్ళు విరుచుకుంటున్నారు.

చేపల వాళ్ళు సరస్సు మీద పడవల్లో వేట చేస్తూ తిరుగుతున్నారు.

తాటి చెట్ల సందుల్లో నుంచి గుడిసెలోకి పడుతున్న సూర్యకిరణాలు రాను రాను వేడెక్కుతున్నాయి.

బాగా పొద్దెక్కింది. పెద్దకాపు మత్తు కళ్ళు సరస్సు మీద కలయజూస్తున్నాయ్. మిగతా వాళ్ళు ప్రక్కనే తాగుడుతో నీరసించిపోయి చతికిల బడి కూర్చున్నారు.

హఠాత్తుగా కిటికీలో నుంచి పడుతున్న ఎండకి ఏదో ఆకారం అడ్డుపడింది- చీకటి వెలుగు- వెలుగు చీకట్లు- రెప రెప లాడుతున్నాయి.

మత్తు కళ్ళతో అందరూ ఆశ్చర్యంగా చూస్తున్నారు.

''క్రీచ్! ... క్రీచ్ !... క్రీ... ఛ్!'' పీండ్రించుకుని ఘీంకరిస్తున్నట్లు పిట్ట అరుపు. ఒళ్ళు గగుర్పొడిచే అరుపు. రివ్వున డేగ కిటికీ లోంచి దూసుకువచ్చింది. రెక్కల నీడలు గోడల మీద వికృతంగా గెంతుతున్నాయి.

రెక్కల చప్పుడు.... డేగ అరుపులు... రక్కుతోంది... చీరేస్తోంది... కండల్ని పీకేస్తోంది.

''అమ్మో! బాబోయ్.. చచ్చాను... పట్టుకో!''- అరుపులు, కేకలు, మూల్గులు.

మెరుపు దాడి. తిరిగి అదే మెరుపు వేగంతో కిటికీలోంచి దూసుకుపోయింది. సరస్సు మీద అస్తవ్యస్తంగా ఎగురుకుంటూ గాలిలా దూసుకుపోతోంది....

రక్తపు మడుగుల్లో పడి దేవుకుంటున్నారు. పెద్దకాపు కళ్ళు చితికిపోయి బయటకు తన్నుకొచ్చి వేలాడుతున్నాయి... రక్తం.. హాహాకారాలు...

సరస్సు మీద ఎగురుతూ, చూస్తుండగనే రాళ్ళని, గుట్టల్ని, అడవిని దాటుకుంటూ ; పట్టపగలు పొడిచిన తోకచుక్కలా, సూర్యునికి అభిముఖంగా తూర్పు కొండల్లోకి అదృశ్యమయింది డేగ.

★

(ఆంధ్రజ్యోతి – వీక్లీ ; 15.2.85 నుండి 8.3.85 : నాలుగు పంచికలు )

( ఈ కథ '' ఆపరేషన్ ఫాల్కన్ '' అనే పేర; హిందీలోకి అనువాదం అయింది. దానిని, భారతీయ జ్ఞానపీఠ్ వారి '' భారతీయ కహానియా – 1985'' అనే పుస్తకంలో ప్రచురించేరు.)